RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 243 మేడ్చల్ మల్కాజ్‌గిరి 24 సెప్టెంబర్ 2024 మంగళవారం పేజీలు : 4

## పాంగాంగ్ వద్ద చైనా తవ్వకాలు

న్యూఢిల్లీ : తూర్పు లద్దాక్‌లోని పాంగాంగ్ సరస్సు వద్ద భారీ బంకర్లు నిర్మించేందుకు చైనా సైన్యం చాలా లోతుగా తవ్వుతున్న దృశ్యాలు ఉపగ్రహ చిత్రాల ద్వారా వెలుగులోకి వచ్చాయి. ఆయుధాలు, ఇంధనం నిల్వచేయడంతోపాటు, సాయుధ వాహనాలకు పటిష్ఠమైన షెల్టర్లుగానూ వీటిని ఉపయోగించుకో నున్నట్టు భావిస్తున్నారు. పాంగాంగ్ సరస్సు ఉత్తర దిక్కున పర్వతాల మధ్య సిర్జాప్ ప్రాంతంలో చైనా సైన్యం పీఎల్‌ఏ(ది పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ) ప్రధాన స్థావరం ఉంది. పాంగాంగ్ సరస్సు చుట్టుపక్కల ప్రాంతాల్లో మోహరించిన డ్రాగన్ సైన్యానికి అదే ప్రధాన కార్యాలయం. దానిని వాస్తవాధీన రేఖకు సుమారు 5 కిలోమీటర్ల దూరంలో నిర్మించారు. అది భారతదేశ భూభాగమని భారత్ వాదిస్తోంది.



# కేసీఆర్ ఎక్కడ?

## కళ్లు కాయలు కాసేలా ఎదురుచూపులు!

## ఒకింత నిరాశకు గురవుతున్న కేడర్!!

కేసీఆర్ నోటి నుంచి వచ్చే మాటలు తూటాల్లా పేలుతాయి. ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెట్టిస్తాయి. అచ్చమైన తెలంగాణ మాండలికంతో చేసే కామెంట్స్ ముచ్చెమటలు పట్టిస్తాయి. అన్నింటికీ మించి తెలంగాణ ప్రజలకు నచ్చుతాయి. కానీ ఆ మాటలు వినబడి దాదాపు ఐదు నెలలు కావస్తోంది. ఆయన కనిపించడం లేదు. ఆయన మాట వినిపించడం లేదు. కారణం ఏంటి? కాంగ్రెస్ ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని భావిస్తున్నారా? లేకుంటే వ్యూహాత్మకమా? ఇప్పుడు తెలంగాణ పొలిటికల్ లో ఇదే ఆసక్తికరమైన చర్చ.

**దశాబ్దకాలం ఆయనే అంతా..** తెలంగాణ రాకముందు ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో కేసీఆర్ తన ప్రసంగాలతో రాష్ట్ర ప్రజానీకాన్ని ఆకట్టుకోగలిగారు. ఆయన సభలో మాట్లాడబోతున్నారంటే అందరూ టీవీల ముందు కూర్చునే పరిస్థితి ఉండేది. అలా.. ఉద్యమం చేసే చివరకు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టగలిగారు. ఇక రాష్ట్రం ఏర్పాటు నుంచి దశాబ్దకాలం పాటు ఆయన పార్టీకి తిరుగులేకుండా పోయింది. ఏ ఎన్నిక వచ్చినా కూడా గులాబీ జెండానే రెపరెపలాడింది. అటు.. ప్రభుత్వంలోనూ తిరుగులేని నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగారు. దశాబ్ద కాలం పాటు అటు పార్టీలోనూ.. ఇటు ప్రభుత్వంలోనూ ఆయన చెప్పిందే నడిచింది.

**ఫామ్‌హౌజ్ దాటని కేసీఆర్...** దశాబ్ద కాలం పాటు ముఖ్యమంత్రిగా కొనసాగిన కేసీఆర్.. మొన్నటి ఎన్నికల్లో అనూహ్యంగా పదవి కోల్పోవాల్సి వచ్చింది. దాంతో అప్పటి నుంచి ఆయన ప్రజల్లోకి వచ్చిన దాఖలాలు లేవు. ఆయనకు సంబంధించిన ఫామ్‌హౌజ్‌లోనే కాలం గడుపుతున్నారు. నేతలతో సమీక్షలైనా.. ఎవరైనా కలవాలన్నా.. అంతా అక్కడే. అంతే తప్పితే ఇంతవరకు బయట కనిపించ లేదు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా కూడా ఒకటే చర్చ జరుగుతోంది. కేసీఆర్ మళ్లీ ఎప్పుడు ప్రజల్లోకి వస్తారా..? అని. అయితే.. రాజకీయ చాణక్యుడిగా పేరున్న కేసీఆర్.. ఇలా ప్రజల్లోకి రాకుండా ఉండిపోవడం పైనా పలు కారణాలు ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇదంతా ఆయన రాజకీయ చతురతలో భాగమేనని ఆయన అభిమానులు అంటున్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై నో కామెంట్స్...** మరోవైపు.. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి పది నెలలు కావస్తోంది.

ఇచ్చిన హామీలను ఆ పార్టీ అమలు చేయడం లేదని బీఆర్ఎస్ నేతలు చాలా సందర్భాల్లో ఆరోపిస్తూ వచ్చారు. రైతులకు ఇచ్చిన హామీలను సగం వరకే తీర్చారని, ప్రజల హామీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని అంటున్నారు. అయితే.. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలపైనా ఇంతవరకు కేసీఆర్ మాట్లాడలేదు. ముందు నుంచీ సైలెంటుగానే ఉండిపోయారు. రైతుబంధు, రైతు భరోసా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిదంటూ పెద్ద ఎత్తున విమర్శలు వచ్చినా.. కేసీఆర్ మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. సీనియర్ నేతగా, ముఖ్యమంత్రిగా చేసిన అనుభవంతో తమ ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరినప్పటికీ కేసీఆర్ మౌనంగానే ఉండిపోయారు.

**బీఆర్ఎస్ వధకాలపై విచారణ...** అయితే.. కాంగ్రెస్ కొలువుదీరినప్పటి నుంచి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలను ఒక్కొక్కటిగా వెలుగులోకి తీసుకొస్తోంది. వాటిని మీద విచారణలు నడుస్తున్నాయి. ఆ విచారణ పూర్తయ్యే వరకు ఇలా సైలెంటుగా ఉండిపోవడమే మంచిదని ఆయన భావిస్తున్నారా..? అనే టాక్ సైతం నడుస్తోంది. ఇప్పటికే కాళేశ్వరంలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ రిటైర్డు జస్టిస్‌తో విచారణ చేపట్టింది. అలాగే జీఎస్టీ స్కామ్ పైనా విచారణ జరుగుతోంది. ఇంకా గొర్రెల స్కీమ్‌పైనా ఆరోపణలు వచ్చాయి. ఇటీవల మరో మంత్రి.. మిషన్ భగీరథలోనూ రూ.20వేల కోట్ల అక్రమాలు జరిగాయంటూ ఆరోపించారు.

అయితే.. ఎంతసేపూ ప్రభుత్వం బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచాలని ప్రయత్నిస్తున్న తరుణంలో వాటికి దీటైన బదులివ్వాలని కేసీఆర్ ఫామ్‌హౌజ్‌లోనే ఉండి వ్యూహరచన చేస్తున్నారని ఆయన అనుచరులు చెప్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే ప్రజాక్షేత్రంలోకి అడుగుపెడుతారని అంటున్నారు. మరోవైపు.. ఆయన రాకకోసం కింది స్థాయి కార్యకర్తల నుంచి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు అంతా కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. అలాగే.. పార్టీలకతీతంగా ఉన్న అభిమానులు సైతం ఆయన తొరగా బయటకు రావాలని ఆకాంక్షిస్తున్నారు. పెద్దాయన రావాలి.. మళ్లీ పార్టీకి ఊపు తీసుకురావాలని కోరుతున్నారు.

# ముగ్గురు మంత్రుల చుట్టూ ఆశావహుల చక్కర్లు

## మార్కెట్ కమిటీ, జిల్లా గ్రంథాలయ సంస్థ పాలక వర్గాల కోసం పట్టు

## డీసీసీ పీఠంపై ఎమ్మెల్యేలతో పాటు నేతల కన్ను!

భద్రాద్రికొత్తగూడెం : జిల్లాలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ నేతలు, పదేండ్లుగా పదవులు లేక ఖాళీగా ఉన్న నాయకులు ఇప్పుడు నామినేటెడ్ పోస్టుల కోసం లాబీయింగ్ చేస్తున్నారు. రాష్ట్రంలోని పలు మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను ప్రభుత్వం ప్రకటిస్తుండడంతో జిల్లాలోని ఆరు వ్యవసాయ మార్కెట్ పాలక వర్గాల కమిటీ చైర్మన్ల కోసం, టెంపుల్స్ పాలకవర్గాలు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోసం నేతలు పోటీ పడుతున్నారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వద్ద ఎవరికివారు ప్రయత్నాలు చేస్తున్నారు.

**మార్కెట్ కమిటీల పదవుల పోటాపోటీ..** జిల్లాలోని ఇల్లెందు, కొత్తగూడెం, దమ్మపేట, చర్ల, భద్రాచలం, బూర్గంపహాడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకవర్గాల కోసం ఎమ్మెల్యేల చుట్టూ ఆశావహులు ప్రదక్షిణలు చేస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతోనూ సిఫార్స్ చేయించుకునేందుకు జోరుగా యత్నాలు సాగిస్తున్నారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం నియోజకవర్గంలోని లక్ష్మీదేవిపల్లి మండలంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం పోటీ పడుతున్న నేతల సంఖ్య పెద్దగానే ఉంది. ప్రధానంగా భట్టి, పొంగులేటి వర్గాలకు చెందిన నాయకులు ఎవరి స్థాయిలో వారు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోస్టుకు డిమాండ్...** జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవికి మంచి డిమాం ఉంది. ఈ పదవి వస్తే పార్టీతో పాటు గవర్నమెంట్ ప్రోగ్రామ్‌లో ప్రోటోకాల్ ఉంటుందనే ఆలోచనతో ఆశావహులు ఉన్నారు.




**భద్రాచలం టెంపుల్ కమిటీ చైర్మన్ ఎవరికో..** జిల్లాలోని భద్రాచలం సీతారామచంద్రస్వామి టెంపుల్ చైర్మన్ పదవికి రోజు రోజుకు పోటీ పెరుగుతోంది.

జిల్లాలోని పాల్వంచలోని పెద్దమ్మతల్లి, కొత్తగూడెంలోని గణేశ్ టెంపుల్‌తో పాటు పలు దేవాలయాలకు చైర్మన్‌లతో పాటు పాలకవర్గాలను ఏర్పాటు చేయనుండడంతో కాంగ్రెస్ నాయకులు మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా పదవులు దక్కించుకునేందుకు యత్నాలను ముమ్మరం చేశారు.

**డీసీసీ పీఠంపై పలువురి ఆశలు...** జిల్లా కాంగ్రెస్? అధ్యక్షుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ని రాష్ట్ర ప్రభుత్వం కట్టబెట్టింది. ఈ క్రమంలో డీసీసీ పదవి నుంచి ఆయనను పక్కన పెట్టే అవకాశం ఉందనే ప్రచారం పార్టీలో జోరుగా సాగుతోంది. దీంతో జిల్లాలోని ముఖ్య నేతలంతా జిల్లా మంత్రులతోపాటు కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమారెడ్డి ఆశీస్సుల కోసం ఎవరి స్థాయిలో వారు ప్రయత్నిస్తున్నారు.




హైదరాబాద్:బంగాళాఖాతంలో రెండు ఉపరితల ఆవర్తనాలు కొనసాగుతున్నాయి. అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో సాయంత్రం నుంచే తెలంగాణ రాష్ట్రం తో పాటు ఏపీలో కూడా వాతావరణ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్రంలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తం చేస్తోంది వాతావరణ శాఖ.. రాష్ట్రంలోని 10జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. రానున్న తెలంగాణ వ్యాప్తంగా నాలుగు రోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతోఈదురుగాలు వీచే అవకాశం ఉందని తెలిపింది. సాయంత్రం నుంచి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణ పేట జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. మరోవైపు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇక హైదరాబాద్ సిటీ లో సాయంత్రం నుంచి తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని ఐఎండీ హెచ్చరిస్తోంది. ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులతో వర్షాలు పడే అవకాశం ఉంది. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్,చ మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, రంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెపుతోంది.



## వరద బాధితులకు సూపర్ స్టార్ మహేశ్ విరాళం.. సీఎంను కలిసి..

హైదరాబాద్: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా కురిసిన భారీ వర్షాలకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు తీవ్రంగా నష్టపోయిన సంగతి తెలిసిందే. అయితే వారిని ఆదుకునేందుకు సినీ హీరో, సూపర్ స్టార్ మహేశ్ బాబు ముందుకు వచ్చారు. ఇప్పటికే ఆయన ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెరో రూ.50లక్షల చొప్పున ప్రకటించారు. ఈ మేరకు ఇవాళ(సోమవారం) తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలిసి దానికి సంబంధించిన రూ.50లక్షల చెక్కును అందజేశారు. అలాగే ఏఎంబీ మాల్ తరఫున మరో రూ.10లక్షలు అందజేశారు. దీంతో ఆయన తెలంగాణకు మ్నొత్తంగా రూ.60లక్షలు ఇచ్చినట్లు అయ్యింది. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి మహేశ్ చెక్కు అందజేశారు. మహేశ్ బాబుతోపాటు ఆయన సతీమణి నమ్రత శిరోద్కర్ కూడా ఉన్నారు. వారిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించిన సీఎం ఇద్దరినీ శాలువాతో సన్మానించారు. అయితే చెప్పిన దాని కన్నా అదనంగా మరో రూ.10లక్షలు ఇవ్వడంపై ఆయన ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహేశ్ బాబు తన మంచి మనస్సును మరోసారి చాటుకున్నారని సోషల్ మీడియా వేదికగా కామెంట్లు పెడుతున్నారు. ఇప్పటికే ఆయన చాలా మంది పిల్లలకు గుండె ఆపరేషన్లు సహా పలువురిని ఆదుకున్నారని గుర్తు చేసు కుంటున్నారు.

తమ అభిమాన నటుడికి మంచి మనసు ఉందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు మహేశ్ బాబు కొత్త లుక్ వైరల్ అవుతోంది. డైరెక్టర్ రాజమౌళితో మహేశ్ చేస్తున్న 'SSMB 29' సినిమా కోసం సూపర్ స్టార్ నయా లుక్‌లో కనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ఈసారి భారీ విజయం ఖాయమంటూ ఫ్యాన్ సంబరపడిపోతున్నారు.



## వారానికి రెండుసార్లు గాంధీ భవన్‌కు మంత్రులు..

హైదరాబాద్: ప్రజా సమస్యలు తీర్చేందుకు, కాంగ్రెస్ శ్రేణులను కలిసేందుకు ఇకపై వారానికి రెండ్రోజులపాటు తెలంగాణ మంత్రులు గాంధీ భవన్‌కు రానున్నారు. ప్రతి బుధ, శుక్రవారాల్లో ఒక్కో మంత్రి చొప్పున గాంధీ భవన్‌కు రానున్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ దీనిపై కీలక నిర్ణయం తీసుకున్నారు. మంత్రులు.. ప్రజలకు అందుబాటులో ఉండడం, తరచూ పార్టీ కార్యకర్తలు, నాయకులను కలవడం వల్ల పార్టీలో జోష్ పెరిగే అవకాశం ఉందని రాష్ట్ర అధిష్ఠానం భావిస్తోంది. ఈ మేరకు నిర్ణయం తీసుకుని అమలు చేస్తున్నారు. అయితే గాంధీ భవన్‌కు తొలి రోజు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రానున్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ మూడు గంటలపాటు ఆయన ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉండనున్నారు. ఇకపై ప్రతి బుధ, శుక్రవారాల్లోనూ మంత్రులు ఇదే సమయంలో అందుబాటులో ఉండనున్నారు.

పార్టీ శ్రేణులు, ప్రజలతో ముఖాముఖి నిర్వహించనున్నారు. తరచూ పార్టీ నాయకులు, కార్యకర్తలను కలవడం వల్ల గ్రామస్థాయి వరకూ పరిస్థితి ఎలా ఉందనే అంశాలు తెలుస్తాయని భావిస్తున్నారు. అలాగే సంక్షేమ పథకాలు సైతం గ్రామస్థాయికి చేరుతున్నాయా, లేదా.. ఒకవేళ చేరితే ప్రజల స్పందన ఏ విధంగా ఉందో తెలుసుకునేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. దీనిపై పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన రోజే గాంధీ భవన్‌కు రావాలని మహేశ్ కుమార్ గౌడ్ మంత్రులను కోరినట్లు తెలుస్తోంది.




హైదరాబాద్: చెరువులు, నాలాలపై ఆక్రమణలను కూల్చివేస్తూ దూసుకెళ్తున్న హైడ్రాకు తెలంగాణ హైకోర్ట్ కీలక ఆదేశాలు జారీ చేసింది. దుర్గం చెరువు పరిసరాల్లో హైడ్రా కూల్చివేతలపై హైకోర్ట్ స్టే విధించింది. 2014లో జారీ చేసిన ప్రిలిమినరీ నోటిఫికేషన్‌పై దుర్గం చెరువు పరిసర నివాసితులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు పిటిషన్ దాఖలు చేశారు.

ఈ అభ్యంతరాలను లేక్ ప్రొటెక్షన్ కమిటీ పరిగణలోకి తీసుకోవాలని హైకోర్ట్ పేర్కొంది. అక్టోబర్ 4న లేక్ ప్రొటెక్షన్ కమిటీ ముందు దుర్గం చెరువు పరిసర నివాసితులు హాజరు కావాలని కోర్ట్ తెలిపింది. అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని అక్టోబర్ 4 నుంచి ఆరు వారాల లోపు తుది నోటిఫికేషన్ జారీ చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు లేక్ ప్రొటెక్షన్ కమిటీకి హైకోర్టు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ పరిణామంతో దుర్గం చెరువు పరిసర నివాసితులకు ఊరట దక్కినట్టు అయ్యింది.

**మాదాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు :** మరోవైపు హైదరాబాద్ నగరంలో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. ఆదివారం కూకట్‌పల్లిలోని నల్లచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలను నేలమట్టం చేసిన హైడ్రా.. ఇవాళ మాదాపూర్‌లో కూల్చివేతలు కొనసాగిస్తోంది. కావూరి హిల్స్ పార్కు స్థలంలో వెలసిన అక్రమ షెడ్లను హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. పార్కులో స్పోర్ట్స్ అకాడమీపై గత కొంతకాలంగా కావూరి హిల్స్ అసోసియేషన్ ఫిర్యాదులు చేసింది. దీంతో తక్షణమే రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ముందుగా స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణాలను తొలగించారు. నిర్మాణాలను తొలగించిన అనంతరం కావూరిహిల్స్ పార్క్ అని అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. కాగా కావూరి హిల్స్ అసోషియేషన్ నుంచి 25 ఏళ్లపాటు లీజుకు తీసుకున్నామి స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు చెబుతున్నారు. గడువు ముగియక ముందే అన్యాయంగా నిర్మాణాలను తొలగిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

గరుడ వార్త

మంగళవారం 24 సెప్టెంబర్ 2024

# సంపాదకీయం

## అగ్గదీ పవన్ 'పవర్' అంటే..!

కూటమిలో మిత్రపక్షంగా ఉన్నప్పటికి అధికార పక్షమనే మర్రిచెట్టు నీడలో విశ్రాంతి తీసుకోవటమే తప్పించి.. తమ సత్తా చాటుకునే రాజకీయ మిత్రపక్షాలు తక్కువగా కనిపిస్తాయి. అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు జనసేన అధినేత పవన్ కల్యాణ్. ఏపీ రాజకీయ ముఖచిత్రాన్నే తీసుకుంటే.. ఎన్డీయే కూటమి సర్కారులో పవన్ కున్న సీట్లు 21 మాత్రమే. టీడీపీకి ఉన్న సీట్లు 135. బీజేపీకి 8 మంది ఎమ్మెల్యేలుఉన్నారు. తెలుగుదేశానికి ఉన్న 135 సీట్ల బలంలో కేవలం 17 శాతం సీట్లు మాత్రమే జనసేనకు ఉన్నాయి. ఒక ప్రభుత్వంలో ఈ స్థాయిలో బలం ఉన్న పార్టీకి ఉండే ప్రాధాన్యత నామ మాత్రంగా ఉంటుంది. కానీ.. పవన్ ప్రత్యేకత వేరు. దీనికి చంద్రబాబు నాయుడ్ని కూడా అభినందించాల్సిందే. తన పరిమితుల గురించి ఆయన తెలుసుకోవటంతో పాటు.. తనకు భారీ ఎదురుదెబ్బ తగిలిన వేళలో మిత్రుడి హోదాలో తనకు అండగా నిలిచిన పవన్ విషయంలో ఆయన ప్రత్యేకమైన అభిమానాన్ని ప్రదర్శించటం కనిపిస్తుంది. అదే టైంలో పవన్ ప్రస్తావన ఇక్కడ తీసుకురావాల్సిందే. సాధారణంగా ఏ రాజకీయ అధినేత అయినా సరే.. తాము అధికారపక్షంలో భాగస్వామ్యంగా ఉంటే.. వారి డిమాండ్లు.. వారి కోరికలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో పవన్ మాత్రం భిన్నమైన ధోరణిని ప్రదర్శిస్తున్నారు. తన వైపు నుంచి ఎలాంటి ఆబ్లిగేషన్లు రాకుండా చూసుకుంటున్నారు. తలనొప్పుల్ని తీసుకురాకుండా జాగ్రత్తలు తీసుకోవటంతో పాటు.. తన పరిధిని మీరకుండా వ్యవహరిస్తున్న వైనం చంద్రబాబుకు సైతం ఆశ్చర్యాన్ని కలిగించేదే. ఎందుకుంటే... ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎంతోమంది మిత్రుల్ని చూశారు. ఎంతోమంది రాజకీయ పార్టీ అధినేతలతో కలిసి పని చేశారు. మిగిలిన వారి తీరుకు పవన్ భిన్నంగా ఉండటం.. తన వ్యక్తిగత ప్రయోజనాలు.. పార్టీ ప్రయోజనాల పేరుతో ఇబ్బంది పెట్టే ధోరణికి దూరంగా ఉండటం పవన్ ప్రత్యేకతగా చెప్పాలి. అదే సమయంలో.. సమయం వచ్చినప్పుడు తన స్థాయిని విస్తరించుకుంటూ పోయే తీరును పవన్ ప్రదర్శించటం కనిపిస్తుంది. తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ విషయంలో సీరియస్ గా ఉన్న పవన్ కల్యాణ్.. టీటీడీ ఈవో శ్యామలరావును పిలిపించుకోవటం.. లడ్డూ ఎపిసోడ్ గురించి వివరాల్ని ఆరా తీయటం చూసినప్పుడు.. అవసరం రావాలే కానీ తన పవర్ ను చూపించే విషయంలో పవన్ అస్సలు తగ్గరన్న విషయాన్ని తన చేతలతో చేసి చూపిస్తున్నారన్న మాట వినిపిస్తోంది. సాధారణంగా ఇంతటి సంచలన విషయాలపై ముఖ్యమంత్రి రివ్యూ చేస్తారు. సీఎం సమీక్షించిన తర్వాత డిప్యూటీ సీఎం పెద్దగా చేసేదేమీ లేదు. కానీ.. తాజా ఎపిసోడ్ లో పవన్ మాత్రం భిన్నంగా వ్యవహరించారు. లడ్డూ కల్తీ విషయంలో తానెంత సీరియస్ గా ఉన్నానన్న విషయాన్ని చెప్పటమే కాదు.. భక్తుల మనోభావాల విషయంలో రాజీ అన్నది లేదన్న విషయాన్ని స్పష్టం చేయటం చూస్తే.. అవసరమైన వేళ పవర్ చూపించే విషయంలో బాబును దాటేస్తానన్న సంకేతాల్ని ఇచ్చారని చెప్పాలి.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

## భారతదేశం అగ్రగామిగా ఎదగ కలుగుతుంది...



శామీర్ పేట, (గరుడ వార్త) : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి నప్పుడే భారతదేశం అగ్రగామిగా ఎదగ గలదని ఐపీఈ కళాశాల డైరెక్టర్ శ్రీనివాసమూర్తి సూచించారు. శామీర్ పేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (జగద్గిరిగుట్ట ) విద్యార్థినిలు సోమవారం శామీర్ పేట ఐపీఈ కళాశాలలో జరిగిన ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ కాంపిటీషన్ అనే కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఐపిఈ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, ప్రొఫెసర్ వై రామకృష్ణ లు ప్రశంస పత్రాలను, బహుమతులను అందజేశారు.

ఈ సందర్భంగా శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ విద్యార్థినిలు చదువులకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించినప్పుడే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని తెలిపారు. అనంతరం మహిళా డిగ్రీ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ మాట్లాడుతూ విద్యార్థినిలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చేతన, కామర్స్ డిపార్ట్మెంట్ హెడ్ రాజ్యలక్ష్మి, అధ్యాపక బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## అసంఘటిత కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



శామీర్ పేట, (గరుడ వార్త) : అసంఘటిత కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర అసంఘటిత కార్మిక సంఘం సభ్యుడు, మల్కాజ్గిరి పార్లమెంట్ కన్వీనర్ కే సుధాకర్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు నగరంలోని లేబర్ కమిషన్ ఆఫీస్ వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమానికి తరలి వెళ్లారు.

ఈ సందర్భంగా సుధాకర్ నాయక్ మాట్లాడుతూ కార్మికులు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ. 10 లక్షలు, సహజ మరణానికి ఐదు లక్షలు చెల్లించాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వకుండా నేరుగా ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ఆధ్వర్యంలో అందజేయాలని కోరారు. 2009లో నమోదు చేసుకున్న కార్మికుల కార్డులు యుద్ధపాతిపాదికన రెన్యువల్ చేయాలని, ఇశ్రం గుర్తింపు కార్డులు భవన నిర్మాణ కార్మికులందరికీ అందజేయాలని, ప్రమాదాలకు గురైన కార్మికులకు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులు, రోడ్లు, పెద్ద కంపెనీలు, ఇటుక బట్టిల్లో పనిచేసే కార్మికులు, వలస కార్మికులందరిని స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బోర్డు లో నమోదు చేసి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. అసంఘటిత కార్మికుల సమస్యలు మరెన్నో ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసంఘటిత కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# 'స్మార్ట్'గా దోచేస్తున్నారు



మేడిపల్లి : స్మార్ట్ ఫోన్ ఉంది కదా అని గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే వాట్సప్ కాల్స్, సందేశాలకు స్పందిస్తే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నాయి. అధిక డబ్బులు ఆశచూపి నేరగాళ్లు అమాయకులను వలలో వేస్తున్నారు. సైబర్ మోసాల బారిన పడుతున్న వారిలో అధికంగా విద్యావంతులే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల సైబర్ ఘటనలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పెరిగిపోయాయి. అప్రమత్తంగా ఉంటేనే మోసాల నుంచి గట్టెక్కవచ్చని పోలీసులు చెబుతున్నారు.

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ఓ హోల్‌సేల్ చికెన్ వ్యాపారికి మోసగాళ్లు వాట్సప్‌లో లింక్ పంపారు. సదరు వ్యాపారి ఆ లింక్‌ను ఓపెన్ చేయగానే రూ.9.60 లక్షలు ఖాతా నుంచి మాయమయ్యాయి.

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి వాట్సప్‌లో వచ్చిన లింక్ బ్యాంక్ నుంచి వచ్చిందే అని భావించి ఏటీఎం వివరాలు పంపాడు. రూ.40 వేలు అకౌంట్ నుంచి బదిలీ అయ్యాయి.

జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల దుంపేటకు చెందిన ఓ వ్యక్తికి ఆధార్ అప్‌డేట్ అంటూ లింక్ రాగా ఓపెన్ చేశాడు. 3 రోజుల్లో అతని ఖాతా నుంచి నిందితులు రూ.1.13 లక్షలు మాయం చేశారు.

ఈ ఏడాది మే నెలలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఓ మహిళ ఎస్పీని కలసి తన కుమారుడిని కంబోడియాలో చిత్రహింసలు పెడుతున్నారని ఫిర్యాదు చేసింది. ఎస్పీ అఖిల్ మహాజన్ కంబోడియా ఎంబసీ అధికారులతో మాట్లాడి సైబర్ నేరస్థుల చెర నుంచి బాధితుడిని విడిపించారు. స్థానికంగా సైబర్ మోసాలకు పాల్పడటం ఒక ఎత్తయితే ఉద్యోగార్థులను కంబోడియాకు రప్పించి ఆన్‌లైన్ మోసాలు చేయిస్తున్నారు. అమాయకులను వలలో వేసేందుకు చైన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని ఏజెంట్లకు రూ.10 వేల చొప్పున ఇస్తున్నారు. కమీషన్ల ఆశతో ఏజెంట్లు పలువురిని కంబోడియాకు పంపుతుండగా అక్కడి నేరగాళ్లు కాల్‌సెంటర్లలో పలువురిని నియమించుకొని సైబర్ నేరాలకు పాల్పడేలా చేస్తున్నారు. ఇలా రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన యువకుడిని కంబోడియాకు పంపిన జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలానికి చెందిన ఓ నిందితుడు సహా మహారాష్ట్రలోని పుణె, బిహార్‌కు చెందిన మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రామగుండం, మంచిర్యాల కోల్‌బెల్ట్ ప్రాంతంలో రూ.10 వేలు పెట్టుబడిగా పెడితే ప్రతిరోజు రూ.500 చొప్పున వస్తాయని కొందరు నమ్మబలికారు. రూ.10 కోట్ల మేర అమాయకుల నుంచి వసూలు చేసి తీరా యాప్‌ను మూసేయడంతో బాధితులంతా లబోదిబోమన్నారు. చైన్ మార్కెటింగ్ పేరిట ఇలాంటి మోసాలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్కువే జరుగుతున్నాయి.

స్టాక్ మార్కెట్‌లో తాము అధిక లాభాలు ఆర్జించిపెడతామని ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటన చూసిన జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన ఓ వైద్యుడు రూ.74.38 లక్షలు మోసపోయి చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అప్రమత్తతే ప్రధానం

పార్ట్‌టైం ఉద్యోగాలు, వర్క్ ఫ్రం హోం, కొరియర్ల పేరిట గుర్తు తెలియని వ్యక్తులు, సంస్థల నుంచి వచ్చే మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దు.

బ్యాంక్ ఖాతాలకు ఫోన్ నంబరు, ఆధార్ నంబరు లింక్ చేయాలంటూ నేరగాళ్లు మోసం చేస్తున్నారు. బ్యాంక్‌కు వెళ్లి నిర్ధరించుకోవాలి గానీ ఇతరులను గుడ్డిగా నమ్మి మోసపోవద్దు.

వాట్సప్‌లో పంపిన క్యూఆర్ కోడ్ ఓపెన్ చేసి వివరాలు పంపాలంటూ పలువురికి మెసేజ్‌లు వస్తున్నాయి. ఇవి కూడా సైబర్ నేరగాళ్లే పంపుతున్నారని గుర్తుంచుకోవాలి.

మీరు లాటరీలో డబ్బులు గెలిచారంటూ సందేశం పంపుతుంటారు. వాటిని నమ్మొద్దు.

డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలను తెలుసుకుని మోసాలకు పాల్పడిన సందర్భాల్లో ముందుగా ఆయా కార్డులను బ్లాక్ చేసి సంబంధిత బ్యాంక్‌కు సమాచారం ఇవ్వాలి.

ఎవరైనా ఆన్‌లైన్ మోసాల బారిన పడినప్పుడు 1930 నంబరుకు, సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో గానీ %cybercrime.gov.in% వెబ్‌సైట్‌లో గానీ ఫిర్యాదు చేయవచ్చు.

సత్వర ఫిర్యాదుతో న్యాయం


సైబర్ మోసాల బారిన పడి విద్యావంతులు కూడా నష్టపోతున్నారు. ట్రేడింగ్, బ్యాంక్ ఖాతాలకు లింక్ తదితరాల పేరిట ప్రమాదకరమైన మెసేజ్‌లు పంపుతూ ఖాతాల్లోంచి నగదు దోచేస్తున్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటం ఎంత ముఖ్యమో ఏదైనా మోసం బారిన పడినప్పుడు 1930 నంబరుకు ఫోన్ చేసి సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్తే న్యాయం జరుగుతుంది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు, మాట్రీమోనీ, బ్యాంక్‌ల పేరిట వచ్చే సందేశాలకు స్పందించవద్దు.

– రఘుచందర్, డీఎస్పీ, జగిత్యాల

## దండుమల్కాపురంలో రెండు టెర్మినళ్లు..!

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండలం దండు మల్కాపురంలో రెండు టెర్మినళ్లు ఏర్పాటు అవుతున్నాయి. సర్వే నంబరు 120లో 83 ఎకరాల విస్తీర్ణంలో రూ.2,800 కోట్లతో నిర్మించే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్) టెర్మినల్ పనులు తుది దశకు చేరుకున్నాయి. త్వరలో ఈ టెర్మినల్‌ను ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. ఏడాది క్రితం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్) టెర్మినల్ నిర్మాణానికి కూడా దండుమల్కాపురం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక పార్కు(ఎంఎస్ఎంఈ) పక్కనే సర్వే నంబరు 617లో 75 ఎకరాల స్థలాన్ని టీఎస్ఐఐసీ కేటాయించింది. సుమారు రూ.1500 కోట్ల వ్యయంతో బీపీసీఎల్ టెర్మినల్‌ను నిర్మించనున్నారు. ప్రస్తుతం బీపీసీఎల్ టెర్మినల్‌కు సంబంధించి పైపులైన్ల నిర్మాణ పనులు చకాచకా జరుగుతున్నాయి. భూమికి 1.5 మీటర్ల లోతులో పైపులను వేస్తున్నారు. వ్యవసాయ భూముల నుంచి వేస్తే రైతులకు, రహదారుల వెంట అయితే ప్రభుత్వ సంస్థలకు పరిహారం చెల్లిస్తున్నారు.

పైపులైన్ల ద్వారా ఇంధనం సరఫరా..



ఈ టెర్మినళ్లలో పెట్రోలియం, డీజిల్, కిరోసిన్, ఎవియేషన్ టర్బన్ ఫ్యూయల్(ఏటీఎఫ్)ను విడుతల వారీగా పైపుల ద్వారా సరఫరా చేసి నిల్వ చేస్తారు. ఏటీఎఫ్‌ను విమానాలకు ఇంధనంగా వాడుతారు. ఐవోసీఎల్ టెర్మినల్‌కు.. పారాదీప్(ఒడిశా) నుంచి దండుమల్కాపురం వరకు 1212 కిలో మీటర్లు మేర పైపులైన్లను వేశారు. ఐవోసీఎల్ టెర్మినల్ నిర్మాణం కూడా దాదాపు పూర్తి కావొచ్చింది. బీపీసీఎల్ టెర్మినల్‌కు.. ఏపీలోని కృష్ణపట్నం(నెల్లూరు) నుంచి దండుమల్కాపురం వరకు 423 కిలో మీటర్ల మేర పైపులైన్లను వేసి ఇంధనాన్ని సరఫరా చేస్తారు. కృష్ణపట్నంకు ఓడరేవుల ద్వారా ఇంధనాన్ని తీసుకొస్తారు. కృష్ణపట్నం, ఒంగోలు, గుంటూరు, నల్గొండ, మునుగోడు మీదుగా దండుమల్కాపురానికి పైపులైన్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో బీపీసీఎల్ టెర్మినల్ నిర్మాణ ప్రాంతంలో కూడా పనులు ప్రారంభించే అవకాశం ఉంది. దేశంలోనే ఇంధన రంగంలో అతి పెద్ద సంస్థలైన ఐవోసీఎల్, బీపీసీఎల్‌ల టెర్మినళ్లను ఇక్కడ నిర్మిస్తుండటంతో దండుమల్కాపురం ప్రాంతం మరింత అభివృద్ధి చెందనుంది.

ప్రయోజనాలివే..!

పెరుగుతున్న వాహనాలను దృష్టిలో పెట్టుకొని డిమాండ్ మేరకు ఇంధనాన్ని నిల్వ చేయవచ్చు. ప్రస్తుతం పెట్రోల్ బంకుల్లో ఏర్పడుతున్న ఇంధనం కొరతను ఇలా నివారించవచ్చు.

పైపులైన్ల ద్వారా సరఫరా అవుతుంది కనుక రవాణా ఛార్జీలు, వాహనాల రద్దీ, కాలుష్యం తగ్గుతుంది. టెక్నికల్ ఉద్యోగాలకు ఎక్కువ అవకాశాలున్నా.. స్థానికులకు కూడా ఉపాధి లభించనుంది.

గ్రామ పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి.

## ఆన్‌లైన్‌లో మమ.. అంతంతే జమ

మునుగోడు : మార్చి 3న మునుగోడు మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి నిర్మాణ అనుమతి కోసం గ్రామ పంచాయతీకి వెళ్తే ..ఆన్‌లైన్ అనుమతి పేరుతో అతని వద్ద రూ.42 వేలను తీసుకున్నారు. కానీ ప్రభుత్వ ఖాతాలో రూ.11,972ను జమ చేసి చూపించారు. గతేడాది ఏప్రిల్ 25న మరో వ్యక్తికి గ్రామ పంచాయతీ రికార్డులో నమోదు చేస్తామని చెప్పి ఇంటి స్థల కొనుగోలు దస్తావేజు ఆధారంగా అతని వద్ద యూపీఐ స్కానర్ ద్వారా రూ.16,500 నగదు తీసుకున్నారు. ప్రభుత్వ ఖాతాలో రూ.3336 జమ అయింది.

గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలన్నా ఆన్‌లైన్ ద్వారా తీసుకునే విధంగా.. గత ప్రభుత్వం ఈ-పంచాయతీ వ్యవస్థని తీసుకువచ్చింది. అయితే దీనిని ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమ సంపాదనపై దృష్టి పెట్టారు. ఈ పంచాయతీలో ఇంటి నిర్మాణం కోసం ఆన్‌లైన్లో అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అనుమతుల కోసం ఇచ్చే నగదును స్కానర్ ద్వారా చెల్లించాలి. కానీ తీసుకునే నగదుకు, చెల్లించే దానికి పొంతన కుదరడం లేదు. ఇలా వందల సంఖ్యలో అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకోని రూ.లక్షల్లో దోచుకొని సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది.

డిజిటల్ పేరుతో దోచేస్తున్నారు...

నల్గొండ జిల్లా మునుగోడు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి నిర్మాణ అనుమతుల కోసం వెళ్తే ఆన్‌లైన్ డిజిటల్ లావాదేవీల పేరిట యూపీఐ స్కానర్ ద్వారా నగదును చెల్లిస్తున్నట్లుగా నమ్మిస్తున్నారు. అంతర్జాలం ద్వారా స్కానర్ చూపిస్తుండటంతో అది నిజమేనని నమ్మి లబ్ధిదారులు డబ్బులు చెల్లించి అనుమతి పత్రాలు పొందుతున్నారు. అయితే వీరు చెల్లించే నగదు, ప్రభుత్వ ఖజానాలో జమయ్యే దాంట్లో చాలా తేడాలు కనిపిస్తున్నాయి. ఇలా అనుమతి పొందిన వారి వివరాలను 'న్యూస్‌టుడే' సేకరించి పరిశీలించగా.. విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నిబంధనలు అతిక్రమించి డిజిటల్ లావాదేవీలకు సొంత ఖాతా యూప్మిఏ స్కానర్‌ను జత చేసి నగదు తీసుకున్నట్లు తెలిసింది. దీంతో పాటు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములకు ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారు. ఇలా రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం: నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్, నల్గొండ

ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే సహించే ప్రసక్తే లేదు. ఆ గ్రామ పంచాయతీకి సంబంధించి వెంటనే విచారణకు ఆదేశాలు జారీ చేస్తాం. తప్పు చేసినట్లుగా నిర్ధారణ అయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

# ఎంజీబీఎస్‌లో డిజిటల్ పార్కింగ్

హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల్లోనే అతిపెద్దదైన ఎంజీ బస్‌స్టేషన్‌లో అత్యాధునిక సౌకర్యాలతో 'డిజిటల్ పార్కింగ్' వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఈ విధానాన్ని తొలిసారిగా ఎంజీబీఎస్‌లో ప్రవేశపెట్టింది. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలు ఎంజీబీఎస్ ప్రాంగణంలోకి ప్రవేశించిన వెంటనే వచ్చిన సమయం, వెళ్లే సమయం సీసీ కెమెరాల్లో నిక్షిప్తమవుతోంది. పార్క్ చేసిన సమయాన్ని బట్టి ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

ఛార్జీల పట్టిక పార్క్‌మేట్‌తో ఒప్పందం: ఎంజీబీఎస్‌లోని ఖాళీ స్థలంలో బైక్‌లకు నాలుగు చోట్ల, కార్ పార్కింగ్‌కు ఒక చోట స్థలం కేటాయించారు. డిజిటల్ పార్కింగ్ వ్యవస్థ దేశంలోని వివిధ విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లలో అమలులో ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకూ 'పార్క్‌మేట్' సంస్థతో ఒప్పందం కుదుర్చుకు



న్నారు. దీంతో ఆర్టీసీకి 92శాతం, సదరు సంస్థకు 8శాతం ఆదాయం సమకూరుతోంది. గతంలో గుత్తేదారులు ఆర్టీసీకి అద్దెలు చెల్లించేవారు. ప్రస్తుతం పార్క్‌మేట్ సంస్థ సిబ్బంది ఇక్కడ పని చేస్తున్నారు.

మెరుగైన సేవలకు కృషి..

డిజిటల్ పార్కింగ్ వ్యవస్థ విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన బస్‌స్టేషన్లలోనూ విస్తరించేందుకు ఉన్నతాధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గతంలో పార్కింగ్ నిర్వాహకులు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తరచూ ఫిర్యాదులు అందేవి. ప్రస్తుతం ఆర్టీసీ సిబ్బంది స్వీయ పర్యవేక్షణలో పార్కింగ్ కొనసాగుతుండడంతో వాహనదారులకు సమస్యలు తలెత్తితే తక్షణమే చర్యలు తీసుకునే అవకాశం ఉంది. శ్రీనివాస్, ఎంజీబీఎస్ సీఆర్ఎం

# ఆహారభద్రతపై ఆశలు

పెద్దపల్లి : రేషన్‌కార్డు, ఆరోగ్య కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులను జారీ చేస్తాం. ఈనెల 19న ప్రజాప్రతినిధుల అభిప్రాయం తీసుకుంటాం. వచ్చే నెల నుంచి కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తాం. – మంత్రి వర్గ ఉపసంఘం భేటీలో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి వ్యాఖ్యలు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకానికి రేషన్‌కార్డు కొలమానం చేశారు. రేషన్‌కార్డు లేకపోవడంతో అభివృద్ధి ఫలాలకు అర్హులైన పేదలు దూరమవుతున్నారు. ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు మిథ్యగా మారింది. కొత్త రేషన్‌కార్డుల జారీపై మంత్రివర్గ ఉపసంఘం స్పష్టత ఇచ్చింది. వచ్చే నెలలో కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొనడంతో పేద వర్గాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

తుది దశకు విధి విధానాలు మంత్రి వర్గ ఉపసంఘంలో కొత్త రేషన్‌కార్డుల విధి విధానాల కూర్పు తుది దశకు చేరింది. పరిమితికి లోబడి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేపట్టారు. కొత్త రేషన్‌కార్డు క్యూఆర్ కోడ్/మైక్రో చిప్/బార్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డు ఉంటుంది. ఆదాయ, ఇతరత్రా అర్హతలపై చర్చలు కొనసాగుతున్నాయి.

నిరీక్షణకు తెర గత కొన్నేళ్లుగా కొత్తగా రేషన్‌కార్డుల మంజూరు లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించినా ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. గత కొద్ది రోజులుగా ఉపసంఘం పలు మార్లు భేటీ అయ్యింది. మార్గదర్శకాలపై కూలంకషంగా చర్చించారు. ఈనెల 19న ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకుని 21న మరోసారి సమావేశం చేపట్టనున్నారు. వచ్చే నెలలో కొత్తగా దరఖాస్తులు స్వీకరించి వడబోత చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లాలో 12,411 పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయి. ఎట్టకేలకు లబ్ధిదారుల నిరీక్షణకు తెర పడనుంది.

అక్రమ దందాకు చెక్‌రేషన్‌కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి నెలకు ఆరు నెలల బియ్యం సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 28 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. ప్రస్తుతం చాలా మంది దొడ్డు బియ్యాన్ని తినడంలేదు. పలువురు బియ్యాన్ని విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దళారులు బియ్యాన్ని కొనుగోలు చేసి పొరుగు రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జనవరి నుంచి సన్నబియ్యం సరఫరా చేస్తే బియ్యం అక్రమ దందాకు తెర పడనుంది.

# ఉల్లి ధర పెరుగుతోంది..!

భానుపురి : ఉల్లి లేకుండా ఏ వంటకం రుచికరంగా ఉండదు. అవి లేకుండా కూరలు వండాలంటే ఎవరూ ఇష్టపడరు. ప్రస్తుతం వాటి ధర రోజురోజుకూ ఎగబాకుతోంది. రెండు నెలల క్రితం రూ.20 పలికిన ధర నేడు మూడింతలు పెరిగింది. ఉల్లి ధర కేజీ రూ.60 వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. సామాన్యులు వీటిని కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా ఉంది. వీటి నియంత్రిణకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

ఇదీ పరిస్థితి

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 367 మంది హోల్‌సేల్ వ్యాపారులు ఉన్నారు. వీరంతా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి జిల్లాకు ఉల్లిని దిగుమతి చేసుకుంటారు. ప్రతి వ్యాపారి నెలకు 20 నుంచి 30 టన్నుల వరకు ఉల్లిని దిగుమతి చేస్తారు. రవాణా ఖర్చులతోపాటు డిమాండ్ ఏర్పడటంతో ఉల్లికి ధర పెరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో ఉల్లి పంట సాగు ఎక్కడా చేపట్టరు. జిల్లాలోని హోల్‌సేల్ వ్యాపారులు ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం మహారాష్ట్ర, కర్ణాటకలో పంట సాగు తగ్గడంతోపాటు, వరదల కారణంగా ధరలపై ప్రభావం చూపుతోంది. దీంతో జిల్లాలోని హోల్‌సేల్ వ్యాపారులు అధిక ధరలకు కొనుగోలు చేసి దిగుమతి చేసుకుంటున్నారు. ఇక్కడికి వచ్చేసరికి రవాణా, ఇతర ఖర్చులు అధికమవుతున్నాయి.

పరిమాణం తక్కువ

ఉమ్మడి నల్గొండ జిల్లాకు దిగుమతి చేసుకున్న ఉల్లి పరిమాణం తక్కువగా ఉంటోంది. ప్రస్తుతం తెల్ల, ఎర్ర ఉల్లిగడ్డలు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. వీటిలో తెల్లరకం ఉల్లిగడ్డలు చిన్నవిగా ఉంటున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంట మునిగిపోవటంతో కొరత ఏర్పడింది. దీంతో పెద్ద సైజు ఉల్లిగడ్డలు మార్కెట్‌కు రావటం లేదు. ఎర్ర ఉల్లిగడ్డ ఎక్కువగా వచ్చినా ప్రజలు తెల్లవాటినే కొనుగోలు చేస్తున్నారు.

# నకిలీ సందేశం.. నమ్మితే ఖాతా ఖాళీ



హైదరాబాద్: జనం డబ్బు కొల్లగొట్టేందుకు సైబర్ నేరగాళ్లు మరో కొత్త మోసంతో ముందుకొస్తున్నారు. బ్యాంకు తరహాలో డబ్బు జమ చేసినట్లు డమ్మీ సందేశాలు పంపిస్తూ బోల్తా కొట్టిస్తున్నారు. అత్యసర పరిస్థితుల్లో ఉన్నామని తమ బ్యాంకు ఖాతా, చరవాణి పని చేయడంలేదని డబ్బు పంపాలంటూ మోసం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో ఈ తరహాలో మోసాలు పెరుగుతున్నట్లు సైబర్ క్రైమ్ పోలీసులు చెబుతున్నారు.

**సహోద్యోగినని నమ్మించి..**

శేరిలింగంపల్లికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఇటీవల ఓ వ్యక్తి ఫోన్ చేసి సహోద్యోగినని చెప్పి తన వాళ్లు ఆసుపత్రిలో ఉన్నారని పరిచయం చేసుకున్నాడు. చరవాణి సాంకేతిక సమస్యతో ఆసుపత్రి బిల్లు చెల్లించడం ఇబ్బందవుతోందని, కొంత డబ్బు కావాలని అడిగాడు. బదులుగా తన మిత్రుడు ఫోన్‌పే, గూగుల్‌పేకి డబ్బు పంపిస్తాడని చెప్పి 9 విడతల్లో రూ.3.74 లక్షలు బదిలీ చేయించాడు. డబ్బు ఖాతాలో జమైనట్లు సందేశాలు రావడంతో ప్రైవేటు ఉద్యోగి నిజమేనని నమ్మి రూ.3.74 లక్షలు తిరిగి పంపాడు. మరుసటిరోజు బ్యాంకు ఖాతాను తనిఖీ చేయగా రూ.3.74 లక్షలు జమవ్వలేదు. ఇదేంటని ఆరా తీయగా సందేశాలు నకిలీవని అవతలి వ్యక్తి మోసం చేసినట్లు తేలింది.

**వ్యక్తిగత డేటా అంగట్లో సరకులా మారడంతోనే..**

సైబర్ నేరగాళ్లు పేరు, సంస్థ పేరు చెప్పి మోసగించడానికి ప్రధాన కారణం వ్యక్తిగత డేటా అంగట్లో సరకులా మారడమే. ప్రైవేటు కంపెనీలు, ఇతర సంస్థల ఉద్యోగుల డేటా లీకవ్వడం ఒకెత్తయితే.. ఏ కంపెనీలో ఏ హోదాలో ఎప్పటి నుంచి పనిచేస్తున్నామో వ్యక్తిగత వివరాలు సామాజిక మాధ్యమాల్లో అందరితో పంచుకోవడమూ సమస్యగా మారుతోంది. వీటిని ఆధారంగా చేసుకుని నేరగాళ్లు తెలిగ్గా మోసగిస్తున్నారు. సామాజిక మాధ్యమ ఖాతాలోని వివరాలతో మోసాలు జరగానికి అదే కారణమని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలివి..**

చిన్ననాటి స్నేహితులమని, బంధువులు, సహోద్యోగి పేర్లతో డబ్బులు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో పంపొద్దు.

పరిచయం లేని వ్యక్తులు డబ్బులు అడిగితే మోసమని గుర్తుంచుకోవాలి.

సాధారణంగా బ్యాంకులు ఒక నిర్దిష్ట విధానంలోనే ఖాతాదారులకు సందేశాలు పంపిస్తాయి. వ్యక్తిగత, నాలుగైదు అంకెలుండే నంబర్లతో పంపవు. మోసపోయినట్లు గుర్తిస్తే వెంటనే 1930 టోల్‌ఫ్రీకి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

# అక్రమ కట్టడాల తొలగింపునకు అధునాతన యంత్రాలు.. టెండర్లు ఆహ్వానించిన హైడ్రా



హైదరాబాద్: ఇప్పటివరకు హైడ్రా చేపట్టిన కూల్చివేతల్లో ఆరంతస్తుల భవనమే ఎత్తైనది. త్వరలో 20నుంచి 30 అంతస్తుల్లోని అక్రమ కట్టడాలు హైడ్రా లక్ష్యం కానున్నాయి. వాటిని నేలమట్టం చేయగల యంత్రాలు సమకూర్చుకునేందుకు టెండరు నోటిఫికేషన్ విడుదల చేశారు.

అనుభవం తప్పనిసరిపిల్లర్లను తుంచేసే ఓ జా క్రషర్, రెండు షీర్ కట్టర్లు, బండరాళ్లను పగులగొట్టే పరికరంతో 20మీటర్ల పొడవైన హైడ్రాలిక్ బూమ్ కలిగిన ఓ బుల్డోజరు అవసరమని కొటేషన్లు ఆహ్వానించింది. 5గంటల్లో 40వేల చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఐదంతస్తుల భవనాన్ని కూల్చిన అనుభవం తప్పనిసరి అని నిబంధన పెట్టింది.

వ్యర్థాల తొలగింపునకూ..

ఇప్పటివరకు 26 ప్రాంతాల్లో 300లకుపైగా నిర్మాణాలను హైడ్రా కూల్చింది. ఆ నిర్మాణ వ్యర్థాలను తొలగించేందుకు తాజాగా టెండర్లు ఆహ్వానించింది. వ్యర్థాలను తొలగించి, చెరువుల్లో పూడిక మట్టిని కూడా వెలికితీయాలని నిర్ణయించింది. శేరిలింగంపల్లిలోని నాలుగు చెరువులను పూర్వస్థితికి తీసుకొచ్చేందుకు టెండర్లు పిలిచామని అధికారులు చెబుతున్నారు.

అడ్డంకులు ఉండొద్దనే నిర్ణయం

"కొందరు ప్రముఖులు చెరువులు, ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టారు. వాటిని గంట నుంచి మూడు గంటల్లో కూల్చాలి. లేదంటే.. న్యాయస్థానాలను ఆశ్రయించి స్టే తెచ్చుకుంటారు. ఎన్–కన్వెన్షన్‌ను కూల్చేటప్పుడు అలాంటి అడ్డంకి వస్తుందని ముందే ఊహించాం. ముందు రోజు 3డీ చిత్రంతో ఆన్‌లైన్‌లో నమూనా కూల్చివేత చేపట్టాం. మరుసటి రోజు పది గంటల్లోపు కట్టడాన్ని నేలమట్టం చేశాం. వ్యర్థాలను తొలగించేందుకు ఎక్స్‌కవేటర్లను మోహరించాం. సమస్యలు ఉండొద్దనే సరైన యంత్ర సామగ్రిని, సంస్థలను సమకూర్చుకుంటున్నాం. కూల్చివేతలకు నాలుగు గంటల ముందు గుత్తేదారుకు పిలుపు వెళ్తోంది. ఓఆర్ఆర్ పరిధిలో ఎక్కడికైనా వాహనాలను తీసుకెళ్లాల్సి ఉంటుంది" అని హైడ్రా తెలిపింది.

# కొత్త బృహత్ ప్రణాళిక



కరీంనగర్ : నగరాలు, పట్టణాల్లో సమగ్రాభివృద్ధి, భవిష్యత్తు అవసరాల కోసం దీర్ఘకాలిక ప్రణాళికలు తయారు చేయడం కోసం కొత్త ప్రణాళిక అమలు చేసేందుకు కసరత్తు జరుగుతోంది. రెండేళ్ల క్రితమే మాస్టర్ ప్లాన్ తయారు ప్రక్రియను ప్రారంభించారు. సాంకేతిక కారణాలతో నిలిపివేయగా మళ్లీ ఈ అంశం తెరపైకి వస్తోంది.

కరీంనగర్ నగరపాలక సంస్థ, శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ (సుడా) పరిధిలో పట్టణీకరణ పెరిగింది. నగరంలో విలీన గ్రామాలు కలిశాయి. గ్రామాల్లో సైతం పట్టణ స్థాయిలో వసతుల కల్పన జరుగుతోంది. కాలనీల సంఖ్య పెరిగిపోవడంతో ఎక్కడ పడితే అక్కడ లేఅవుట్ లేకుండా స్థలాలు కొనుగోలు చేయడంతో అనేక సమస్యలకు కారణంగా మారుతోంది. అమృత్ నగరంతో పాటు పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో కొత్త బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) ప్రకారం రహదారులు కొలతలు, పార్కులు, సామాజిక స్థలాలు, ప్రభుత్వ స్థలాల గుర్తింపు, పారిశ్రామిక ప్రాంతం, నివాసిత, వాణిజ్య ప్రాంతాలు సులువుగా గుర్తించి అనుమతులు ఇచ్చే అవకాశముంటుంది.

ఇప్పటికే బేస్ మ్యాపు తయారు

కొత్త ప్రణాళికను తయారు చేసేందుకు వీలుగా రెండేళ్ల క్రితమే ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. భౌగోళిక సమాచార విధానం (జియో గ్రాఫికల్ ఇన్మరేషన్ సిస్టమ్) జీఐఎస్ విధానంలో మాస్టర్ ప్లాన్ సర్వే చేపట్టారు. నివాసిత, వాణిజ్య ప్రాంతాలు, రోడ్లు, భవనాల ఎత్తు, మురుగునీటి కాలువలు, ప్రభుత్వ స్థలాలు పలు వివరాలతో బేస్ మ్యాపు తయారు చేశారు. నగరపాలిక, సుడా పరిధిలో జీఐఎస్ ఆధారిత ప్రణాళికపై తుది కసరత్తు చేశారు. ఈ నేపథ్యంలో ఆ సమయంలో అప్పటి కలెక్టర్, నగర మేయర్ సునీల్‌రావు, అప్పటి సుడా ఛైర్మన్ అధ్యక్షతన పలుమార్లు సమావేశాలు కూడా నిర్వహించారు.

27 ఏళ్ల నాటిదే అమలు

కరీంనగర్ నగర పరిధిలో 1997లో ఆమోదించిన పట్టణ ప్రణాళికను అమలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతీ ఇరవై ఏళ్లకు ఒకసారి దీన్ని తయారు చేయాల్సి ఉంటుంది. నాటి పాత మాస్టర్ ప్లాన్ ప్రకారమే భవన అనుమతులు, రహదారుల విస్తరణకు వాడుతున్నారు. జిల్లాలో కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పాటు అయ్యాయి. కొన్ని గ్రామాలు విలీనమయ్యాయి. సరిహద్దులు మారాయి. కొత్త ప్రణాళికలు తప్పనిసరిగా మారింది.

ముందుగా ప్రజాభిప్రాయ సేకరణ

కొత్త మాస్టర్‌ప్లాన్ అమలు చేసేందుకు అమృత్ పథకం నిధులు కేటాయించనుంది. డిసెంబరు నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయకపోతే ఆ పథకం గడువు ముగుస్తోంది. ఆ తర్వాత ఎవరికి వారు నిధులు ఖర్చు చేసుకోవాల్సి ఉంటుంది. నెలాఖరులోగా ప్రజాప్రతినిధులు, కలెక్టర్, అదనపు కలెక్టర్లు, కార్పొరేటర్లు, అన్ని విభాగాల అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు. ప్రజాభిప్రాయాన్ని తీసుకొని మార్పులు చేర్పులుంటే పరిగణలోకి తీసుకుంటారు. అందరి అభిప్రాయం మేరకు, గడువులోగా మాస్టర్‌ప్లాన్ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని సుడా ఛైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు.

తీరనున్న ఇబ్బందులు

మాస్టర్‌ప్లాన్ అమలు జరిగితే సుడా పరిధితో పాటు నగరంలోని విలీన కాలనీలు, పారిశ్రామిక ప్రాంతాల్లో ఇంటి అనుమతులు సులువుగా పొందే వీలుంటుంది.

గతంలో తీగలగుట్టపల్లి బఫర్ జోన్‌లో ఉండేది. అక్కడ రైల్వేస్టేషన్ ఉండటంతో పారిశ్రామిక ప్రాంతంగా నగరపాలికలో ఉంది. దీనిని సవరిస్తే నివాసిత ప్రాంతంగా మారనుంది.

నగరంలో రహదారులు, భవనాల శాఖ పరిధిలోని వంద అడుగుల రహదారి ఉంది. రహదారి విస్తరించడంతో మిక్స్‌డ్ యూజ్‌లోకి తీసుకుంటారు.

కట్టరాంపూర్‌లో వ్యవసాయ భూమి ఉండగా అది రెసిడెన్షియల్ కిందికి వస్తోంది.

కోతిరాంపూర్‌లో కొంత ప్రాంతాన్ని వాణిజ్య ప్రాంతంగా పరిగణలోకి తీసుకునే వీలుంది.

భగత్‌నగర్ గోదాముల వెనుకాల ఉన్న ప్రాంతంలో ఇంటి అనుమతులే ఇవ్వడం లేదు. అక్కడ ప్రస్తుతం అన్ని నివాసిత ఇళ్లు నిర్మించుకున్నారు. అలాంటి ప్రాంతాన్ని మార్చుకోవచ్చు.

సుడాతో పాటు, నగరంలోని అన్ని వీధి రహదారులు ఇక మీదట 30 అడుగులకు ఉండనున్నాయి.

# కాన్పు కోసం వెళ్తే.. కంగారే

కొత్తగూడెం : కొత్తగూడెం రామవరంలోని జిల్లా మాతా, శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో దయనీయ పరిస్థితులు కొనసాగుతున్నాయి. కాన్పు నిమిత్తం వెళ్లేవారిని సదుపాయాలు లేవని, ఆరోగ్య పరిస్థితి ప్రమాదకరంగా ఉందనే కారణాలతో ఖమ్మం, వరంగల్ ఆసుపత్రులకు రిఫర్ చేసి చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పటికప్పుడు దూర ప్రయాణం చేయలేని పరిస్థితుల్లో చాలామంది జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి కాన్పులు చేయించుకుంటున్నారు. తల్లీబిడ్డకు ఆపదంటూ పెద్దాసుపత్రులకు పంపుతుంటే 'ప్రైవేటు'లో మాత్రం సురక్షితంగా బిడ్డలకు జన్మనిస్తుండటం గమనార్హం. మరికొన్ని ఘటనల్లో దూరప్రాంతాలకు తరలించేలోగా తల్లీబిడ్డల పరిస్థితి విషమిస్తోంది.

కొత్తగూడెం పట్టణానికి చెందిన ఓ ఆటో యజమాని తన సోదరిని ప్రసవం నిమిత్తం ఎంసీహెచ్‌కు ఈనెల 14న తీసుకెళ్లారు. ఆమెకు టైఫాయిడ్ జ్వరం ఉందని, ప్రసవం చేస్తే కడుపు ఉబ్బుతుందని వైద్యులు భయపెట్టారు. ఆధునిక సదుపాయాలు లేవని, ఖమ్మం లేదా వరంగల్ వెళ్తే బాగుటుందని సూచించారు. దిక్కుతోచని స్థితిలో ఆటోను అమ్ముకుని మరీ స్థానిక ప్రైవేటు దవాఖానాలో సోదరికి కాన్పు చేయించారు.

కొత్తగూడెం గాజులరాజం బస్తీకి చెందిన గర్భిణిని ఈనెల 18న రాత్రి 11 గంటల సమయంలో ఆసుపత్రికి తీసుకొచ్చారు. ప్రసవం సంక్లిష్టంగా మారిందని, ఖమ్మం తీసుకువెళ్లాలని వైద్యులు చెప్పారు. పురిటినొప్పులు ఎక్కువ కావడంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా.. అక్కడి వైద్యులు తెల్లవారుజామున శస్త్రచికిత్స చేసి బిడ్డను బయటకు తీశారు.

మరో నిండు చూలాలు ప్రసవ వేదనతో ఆసుపత్రికి రాగా.. లోపల బిడ్డ పరిస్థితి బాగోలేదని వైద్యులు చెప్పారు. ఏదైనా పెద్దాసుపత్రికి వెంటనే వెళ్లాలని సిఫార్సు చేశారు. భయంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిన గర్భిణి కుటుంబీకులు మళ్లీ ఎంసీహెచ్‌కే వచ్చి వైద్యులను ఆశ్రయించి కాళ్లావేళ్లాపడ్డారు. అయినా కాదనడంతో ఖమ్మం తరలించగా అక్కడ మృత శిశువు జన్మించాడు. ప్రసవం ఆలస్యమై బిడ్డ మృతిచెందడంతో బాధిత కుటుంబం కన్నీటి పర్యంతమైంది.

లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్లకు చెందిన ఓ గర్భిణిని ఇటీవల ప్రసవం కోసం ఆసుపత్రికి తీసుకురాగా.. హైరిస్క్ కేసు అని కాన్పు చేయలేదు. ఖమ్మం, అక్కడ్నుంచి వరంగల్ తీసుకెళ్లగా అప్పటికే నిండు చూలాలు బిడ్డతో సహా కన్నుమూసింది.

ఇతర సమస్యలివే..ఏఎన్‌సీ చెకప్‌కు తీసుకెళ్లినప్పుడు డెలివరీ సౌకర్యం ఉండటం లేదు.స్కానింగ్ సౌకర్యం లేదు.

రక్త పరీక్షల సదుపాయాలన్నీ అందుబాటులో లేవు.

అకారణంగా పెద్దాసుపత్రులకు రిఫర్‌చేస్తున్నా పర్యవేక్షించే నాథుడు లేడు.

నవజాత శిశు వైద్య నిపుణులు అందుబాటులో లేరు.

ఆక్సిజన్ సదుపాయం సరిగా ఉండటం లేదు.

బీపీ ఆపరేటర్లు లేరు.

ఔషధాల కొరత వేధిస్తోంది.

ఎంసీహెచ్‌లో కేవలం ఇద్దరే ప్రసూతి వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారు. ఇంకా వైద్యులు అవసరం. ఖాళీల భర్తీకి ప్రయత్నిస్తున్నాం. కొత్తగా విధుల్లో చేరేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. హైరిస్క్ కేసులను పెద్దాసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఇప్పుడున్న ఇద్దరి వైద్యుల్లో ఎవరైనా ఒకరు అనారోగ్యంతో సెలవు పెడితే సేవలపై తీవ్ర ప్రభావం పడుతోంది. అయినా కాన్పు కోసం వచ్చేవారికి మెరుగైన వైద్యమందేలా, సకాలంలో ప్రసవం జరిగేలా చూస్తున్నాం. సమస్యల్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. రాధామోహన్, సూపరింటెండెంట్, జిల్లా సర్వజన ఆసుపత్రి

# నిర్దిష్ట గస్తీ.. ప్రమాదాలకు స్వస్తి..!

కొత్తగూడెం : రోడ్డు భద్రతలో సురక్షిత మౌలిక సదుపాయాలు, వేగ పరిమితులు, పాదచారులు, సైకిల్ చోదకుల అనుకూల విధానాల ద్వారా స్వీడన్ దేశంలో ప్రమాదాలు సున్నాకు చేరాయి. 2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాల శాతాన్ని సున్నాకు తీసుకు రావాలనే లక్ష్యాన్ని భారత్ నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల (బ్లాక్ స్పాట్లు)ను గుర్తించి అక్కడ మెరుగైన సదుపాయాలు కల్పించటంతో పాటు పోలీసుల గస్తీ ద్వారా లక్ష్యాన్ని చేరుకోవచ్చునని అధికార యంత్రాంగం భావిస్తోంది.

అతివేగం, మద్యం తాగి వాహనం నడపటం, పరిమితికి మించిన లోడ్‌తో వెళ్లటం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయటంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని రోడ్లు నిత్యం నెత్తురోడుతున్నాయి. ప్రతినెలా సగటున 20 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు వినూత్న చర్యలకు సిద్ధమవుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలు, సమయాన్ని సాంకేతికంగా అధ్యయనం చేసి ప్రత్యేక గస్తీ నిర్వహించాలని భావిస్తున్నారు.

సంబంధిత ఠాణాలకు బాధ్యతలు..

ఉభయ జిల్లాల్లో ఎక్కడెక్కడ, ఏ సమయంలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయో వివరాలు తెప్పించి విశ్లేషిస్తున్నారు. అత్యధిక ప్రమాదాలు ఉదయం 5–6, 8–9 గంటల మధ్య, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 మధ్య జరుగుతున్నట్లు గుర్తించారు. నిర్దిష్ట సమయాల్లో ఆయాచోట్ల గస్తీ నిర్వహించనున్నారు. ఈ బాధ్యతలను సంబంధిత ఠాణాలకు అప్పగించనున్నారు. 'నిర్దిష్ట' గస్తీతో బ్లాక్ స్పాట్లలో ప్రమాదాలు జరగకుండా చూడాలని పోలీసుశాఖ నిర్ణయించింది.

వివిధ శాఖల సమన్వయంతో..



గడిచిన మూడేళ్లలో జాతీయ, రాష్ట్ర రహదారులపై జరిగిన ప్రమాదాల్లో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది మృతిచెందిన ప్రదేశాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తిస్తున్నారు. ఆయా ప్రదేశాల్లో ప్రమాదాల నివారణకు పోలీసు, పంచాయతీరాజ్, రవాణా, రెవెన్యూ, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయనున్నారు. అవసరమైనచోట్ల గుంతలు పూడ్చించటం, మరమ్మతులు చేపట్టడం, రహదారులను సరిచేయటం, బారికేడ్లు అమర్చటం, జీబ్రా గీతలు, డివైడర్లు, సీసీ కెమెరాలు, వేగ నియంత్రికలు, ట్రాఫిక్ సిగ్నల్స్ వంటివి ఏర్పాటు చేయనున్నారు.

జిల్లా రోడ్డు భద్రత కమిటీ పర్యవేక్షణలో బ్లాక్ స్పాట్లలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. జాతీయ, రాష్ట్ర, ఇతర ప్రధాన రహదారులను అనుసంధానించే రోడ్లపై అవసరమైనచోట్ల వేగ నియంత్రికలు నిర్మిస్తున్నాం. ప్రధాన రహదారులపై హెచ్చరిక బోర్డులు, మలుపులను తెలిపే సూచికలు, ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేశాం. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటాం. బ్లాక్ స్పాట్లలో పోలీసు గస్తీని పెంచుతాం. సునీల్‌దత్, సీపీ, ఖమ్మం

## బడిలో స్వచ్ఛతకు 'సై'

భువనగిరి : సర్కారు బడుల్లో స్కావెంజర్ల నియామకానికి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన జీవో నెంబర్ 21 అన్ని పాఠశాలలకు చేరింది. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా విడుదలయ్యే కాంపోజిట్ స్కూల్ గ్రాంటుకు అదనంగా ఈ నిధులను అందజేయనున్నారు. ప్రభుత్వం తీసుకున్న తాజా ఈ నిర్ణయంతో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి కూడా ఉపశమనం కలగనుంది.

నేరుగా అమ్మ ఆదర్శ కమిటీల ఖాతాల్లోకి..

నిధులు నేరుగా అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల ఖాతాలో జమ



కానున్నాయి. మూడు నెలలకు సంబంధించిన నిధులను ముందే సంబంధిత ఖాతాలలో జమ చేయాలని నిర్ణయించారు. జిల్లా మినరల్ ఫండ్ ట్రస్టు నుంచి ఈ నిధులను అందజేయాలని నిర్ణయించినట్లు జీవోలో విద్యాశాఖ పేర్కొంది. స్కావెంజర్ నిత్యం పాఠశాల, పరిసరాలను శుభ్రపరచడం, మూత్రశాలలు, మరుగుదొడ్లను కడగడంతో పాటు మొక్కలకు నీళ్లు పెట్టడం తదితర పనుల్ని నిర్వహించాల్సి ఉంటుంది.

తొలగనున్న ఇబ్బందులు.. ప్రభుత్వ నిర్ణయంతో పారిశుద్ధ్య పరంగా ఎదురవుతున్న ఇబ్బందులు పాఠశాలలకు తప్పనున్నాయి. ఈ చర్యతో పంచాయతీ సిబ్బందికి పనిభారం తగ్గనుంది. పారిశుద్ధ్య పనులు నిర్వహించే వారికి ప్రతి నెలా రూ.3 వేలకు తగ్గకుండా ఇవ్వాలని నిర్ణయించడంతో పారిశుద్ధ్య పనులకు కూలీలు పోటీ పడే అవకాశం లేకపోలేదని పలువురు భావిస్తున్నారు.

## ఆలోచన గానుగ తిప్పింది..!

నల్గొండ : నిత్యావసర వస్తువుల్లో రోజు రోజుకు కల్తీ పెరిగిపోతోంది. వంటకాల్లో కీలకమైన నూనెలో ఇది ఎక్కువగా జరుగుతోంది. కల్తీ నూనె వినియోగించిన ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్న దుస్థితి నెలకొంది. ఈ తరుణంలో ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా నల్గొండ మండలం రాములబండ గ్రామానికి చెందిన యువ రైతు దంపతులు బొబ్బిలి జనార్దన్‌రెడ్డి, జ్యోతి స్వచ్ఛమైన నూనె తయారు చేసి అందిస్తున్నారు. ఎద్దులతో నడిచే కట్టె గానుగతో సహజసిద్ధమైన నూనెలను వినియోగదారుల ముందే తయారు చేసి అక్కడే ప్రజలకు అమ్మకాలు చేపడుతున్నారు. ప్రత్యేకంగా డబ్బాలల్లో ప్యాకింగ్ చేస్తూ ఇతర ప్రాంతాలకు సైతం ఆర్డర్లపై సరఫరా చేస్తున్నారు. పలువురుకి ఉపాధి రైతు జనార్దన్‌రెడ్డి తొలుత ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లి పదేళ్లకు పైగా హౌజ్ వైరింగ్, లైటింగ్, డెకరేషన్



వంటి పనులు చేసేవారు. 2019లో విజృంభించిన కరోనాతో ఆయన తన స్వగ్రామానికి చేరారు. తనకు ఉన్న సాగుభూమిలో వ్యవసాయంతోపాటు కల్తీలేని సహజసిద్ధమైన వంట నూనె తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలసి గానుగలు రెండు తయారు చేయించి కల్తీలేని పల్లీ, కొబ్బరి, నువ్వులు, కుసుమ, ఆవాలుతో నిత్యం వందల లీటర్ల నూనె తయారు చేసి ఉత్పత్తి ప్రారంభించారు. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో యూనిట్ ఉండటంతో గానుగ నూనెకు ఆదరణ పెరిగింది. దీంతో తను ఆర్థికంగా రాణించడంతో పాటు నలుగురు గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించి యువతకు ఆదర్శంగా నిలిచారు.

## దేవాదాయ శాఖలో.. ధర్మకర్తల సందడి

భద్రాచలం : దేవాదాయ శాఖలో ధర్మకర్తల మండళ్ల ఎంపికకు రంగం సిద్ధమైంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని 23 ఆలయాలకు ట్రస్ట్ బోర్డులను నియమించాలని ఆశాఖ నిర్ణయించింది. ఈమేరకు దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి ఈనెల 3న ఉత్తర్వులు జారీ చేశారు. వీటి ప్రతులను ఆయా మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని 6 సి, 6 బి కేటగిరీల కోవెళ్లలో ఈ తరహా సందడి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతగానో శ్రమించినందున తమ సేవలను గుర్తించి గౌరవ హోదా కల్పించాలని కొందరు నాయకులు మంతనాలు సాగిస్తున్నారు.

ఆశావహుల్లో సంతోషం..



భద్రాచలంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం, శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం, దుమ్ముగూడెం మండలంలోని శ్రీఆత్మారామ చంద్రస్వామి ఆలయాలకు ధర్మకర్తలు లేరు. ఈ ఏడాది జూన్‌లో పదవీకాలం పూర్తి కావడంతో పాత కమిటీలు రద్దయ్యాయి. కొత్త నోటిఫికేషన్.. ఆశావహులకు సంతోషాన్ని కలిగిస్తోంది. అన్నపురెడ్డిపల్లి మండలంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం, కొత్తగూడెంలోని పాండురంగ భజన మందిరం, ఖమ్మంలోని మైసమ్మ ఆలయం వంటి చోట్ల పాలక మండళ్లను నియమించేందుకు కసరత్తు మొదలైంది. ఐదు నుంచి ఏడుగురు వరకు కమిటీలో ఉండొచ్చు. ఇందులో మహిళ, ఎస్టీలకు ప్రాధాన్యం ఉంటుంది. నోటిఫికేషన్ వచ్చిన తేదీ నుంచి 15 రోజుల్లోగా దేవాదాయ శాఖకు అన్ని అర్హత పత్రాలతో ఫొటోను జతపరిచి దరఖాస్తు చేసుకోవాలి. ఇందులో పోలీసు కేసులు లేవనే నిర్ధారణ పత్రం తప్పనిసరి. శాఖాపరమైన విచారణ పూర్తయ్యాక వీటిని భర్తీ చేసే వీలుంది. అసిస్టెంట్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, ప్రభుత్వం పారదర్శకంగా నియమిస్తుందని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ ఈఓ సుదర్శన్ తెలిపారు.

# తీరు మారేనా..!



జగిత్యాల : విద్యుత్తు సరఫరాలో సమస్యలుంటే ప్రతి సోమవారం ప్రజావాణి, వినియోగదారుల సేవా కేంద్రంలో ఫిర్యాదు చేయవచ్చు.. అధికారులు, సిబ్బంది లంచం అడిగితే టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఇలా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరాతోపాటు అధికారులు, సిబ్బంది పారదర్శకంగా ఉండేందుకు ఎన్‌పీడీసీఎల్ చర్యలు చేపట్టింది. సంస్థలో తీసుకొస్తున్న మార్పులకు అనుగుణంగా పనిచేస్తేనే వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందనున్నాయి.


గతంలో ఆరోపణలు..విద్యుత్తు స్తంభం, నియంత్రిక అవసరమైతే చేయి తడపందే పనులు కావనే ఆరోపణలు ఉండేవి.. కొత్త స్తంభం వేసి తీగలు బిగించాలంటే సిబ్బంది సతాయించేవారని ఫిర్యాదులు అందేవి. నియంత్రిక కాలిపోతే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించేవారు. రైతులు తలా కొంత వేసుకొని ట్రాక్టర్లు సమకూర్చుకొని ఉపకేంద్రాలు, జిల్లా కేంద్రంలోని మరమ్మతు కేంద్రానికి తరలించేవారు. ఇళ్ల సమీపంలో విద్యుత్తు తీగలు వేలాడుతున్నా, కొత్త మీటరు బిగించాలన్నా ఇబ్బందులు ఎదురయ్యేవి. విద్యుత్తు సమస్యల పరిష్కారానికి వినియోగదారుల సదస్సులు నిర్వహించినా ఫలితం లేకుండేది. విద్యుత్తు బిల్లుల్లో సాంకేతిక సమస్యలు తలెత్తినా పరిష్కారానికి నోచుకోవనే ఆరోపణలుండేవి.

ప్రస్తుతం ఇలా..!

తాజాగా విద్యుత్తు వినియోగదారులకు పారదర్శకంగా సేవలు అందించేందుకు ఎన్‌పీడీసీఎల్ నూతన మార్పులకు శ్రీకారం చుడుతోంది. సిబ్బంది, అధికారులకు వినియోగదారులు లంచం ఇవ్వొద్దని, ఎవరైనా లంచం అడిగితే శాఖ అందుబాటులో ఉంచిన టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని పేర్కొంటున్నారు. గతం కంటే చాలా సౌకర్యాలు మెరుగుపర్చామని, విద్యుత్తు స్తంభాలు, నియంత్రికల కొరత లేకుండా చూస్తున్నామని అధికారులు చెబుతున్నారు. సమస్యలు ఎదురైతే సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేయొచ్చని, ఓ వైపు టోల్‌ఫ్రీ నంబరు, మరోవైపు ప్రజావాణి సహా ప్రతిరోజు తమ శాఖ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. వినియోగదారులతో మర్యాదగా ఉండేందుకు జేఎల్ఎం నుంచి ఏఈ వరకు రెండు నెలల కిందట శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి జిల్లాకు ఓ నోడల్ అధికారిని నియమించి సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తున్నారు. ఉప కేంద్రాల వారీగా విద్యుత్తు సరఫరాలో లోపాలు ఉంటే నమోదు చేసుకొని సరి చేస్తున్నారు. ఏదైనా సమస్య ఉంటే అప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, నియంత్రికలను సరి చేస్తున్నారు. వర్షంలోనూ సమస్య వస్తే సరఫరాను పునరిద్ధరిస్తున్నారు.

అవగాహన కల్పిస్తాం.. సేవల్లో పారదర్శకంగా ఉండాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అన్ని కార్యాలయాల్లోనూ వినియోగదారులకు కనిపించేలా టోల్‌ఫ్రీ నంబరు వివరాలను బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తాం. సిబ్బంది, అధికారులు లంచం అడితే కఠిన చర్యలు తీసుకుంటాం. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎన్‌పీడీసీఎల్ పని చేస్తుంది. గంగాధర్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ

# బిల్లుల చెల్లింపుల్లో గందరగోళం



భగత్‌నగర్: గత జులై నుంచి విద్యుత్తు బిల్లులను యూపీఐ మాధ్యమాలైన గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎంల నుంచి చెల్లించడాన్ని నిలిపివేస్తూ ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయంతో.. సంస్థకు ఆన్‌లైన్ చెల్లింపులు తగ్గిపోయాయి. గతంతో పోలిస్తే 40 వేల విద్యుత్తు సర్వీసుల వారు ఆఫ్‌లైన్‌లో చెల్లించారు. దీంతో సంస్థ ఉద్యోగులపై పనిభారం పెరిగింది. వినియోగదారుడు చెల్లించేందుకు విద్యుత్తు బిల్లుల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.


సంస్థపై అదనపు భారం..ఇప్పటివరకు వివిధ రకాల యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులతో ఉద్యోగులకు పనిభారం తగ్గడంతోపాటు సంస్థకు ఆర్థిక భారమూ తగ్గింది. జిల్లాలో ఆన్‌లైన్ చెల్లింపులూ 63 శాతం పెరిగాయి. అయితే విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రంలో చెల్లిస్తే వినియోగదారుడికి రశీదు ఇవ్వాలి. దానికోసం ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేసి.. అందులో ఒప్పంద పొరుగుసేవల కార్మికులను నియమించింది. ఇందులో వినియోగదారుడి ఒక్కో చెల్లింపునకు.. పొరుగుసేవల కార్మికునికి నగరంలో రూ.2.49 పైసలు, గ్రామాల్లో రూ.2.73 పైసలు చెల్లిస్తున్నారు.

జూన్‌లో 1,37,179 సర్వీసులు యూపీఐ మాధ్యమాల్లో చెల్లించాయి. గత నెలలో యూపీఐ మాధ్యమాల్లో చెల్లింపులను నిషేధించి.. విద్యుత్తు సంస్థ నిర్దేశించిన యాప్, బిల్ డెస్క్‌లో చెల్లించాలనడంతో.. 57,907 సర్వీసుల వారు విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలను ఆశ్రయించారు. విద్యుత్తు సంస్థకు రూ.1,44,188 అదనపు ఆర్థిక భారం పడింది. ఇదే సమయంలో రశీదు కోసం ఇచ్చే పేపర్‌తోపాటు బిల్లింగ్ యంత్రం కార్మికులకు అందుబాటులో పెట్టాల్సి ఉంటుంది. ఇది సంస్థకు మరో భారం. విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాల్లో చెల్లించిన వినియోగదారుల వివరాలను సంస్థ లెడ్జర్‌లో నమోదు చేయాలి. ఇలా వెయ్యి సర్వీసులు నమోదు చేయడానికి ఒకరోజు పడుతుంది. ఈ ఇబ్బందులను అధిగమించినా.. బిల్లు నమోదు సమయంలో మానవ తప్పిదాలు దొర్లే అవకాశం ఉంటోంది. ఇది వినియోగదారునికి శాపంగా మారుతుంది.

సులువుగా.. రుసుము లేకుండా

విద్యుత్తు సంస్థ అందుబాటులో ఉంచిన %www.tgnpdcl.in% వెబ్‌సైట్‌లో లేదా %TGNPDCL% యాప్‌లో, ఎన్‌పీడీసీఎల్ బిల్ డెస్క్‌లో బిల్లులు చెల్లించేందుకు సంస్థ అవకాశం కల్పించింది. అయితే ఈ అవకాశాన్ని క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది విస్తృతంగా ప్రచారం చేయాలి. ఈ యాప్‌లో ప్రవేశించాక.. గూగుల్ పే లాంటి యూపీఐ ప్రొవైడర్లను వాడే అవకాశమూ ఉంది. ఇటీవల ఓ వినియోగదారుడు తనకు వచ్చిన విద్యుత్తు బిల్లు రూ.3933ను సంస్థ నిర్దేశించిన మాధ్యమాల్లో ఆన్‌లైన్‌లో చెల్లించడానికి ప్రయత్నించగా.. కన్వీనియన్స్ రుసుము రూ.35.39, జీఎస్టీ రూ.6.37 చూపించడంతో ఈ విషయాన్ని సీనియర్ అకౌంట్స్ అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. క్రెడిట్ కార్డులు ఉపయోగించినప్పుడు ఇలా జరిగి ఉంటుందని, యూపీఐ ఐడీని వినియోగిస్తే ఎలాంటి అదనపు రుసుములు చెల్లించాల్సి ఉండదని స్పష్టం చేశారు.

## వినియోగదారుల కమిషన్లు పెంచితేనే సత్వర న్యాయం



హైదరాబాద్: కేసుల పరిష్కారంలో వేగం పెంచేలా రంగారెడ్డి జిల్లాలో మూడు వినియోగదారుల కమిషన్లు, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాల్లో ఒక్కో కమిషన్ ఏర్పాటు చేయాలంటూ ఆయా జిల్లా వాసుల నుంచి డిమాండ్లు పెరుగుతున్నాయి. హైదరాబాద్‌లో మూడు కమిషన్లు ఉన్నా.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు కలిపి ఒకే కమిషన్ ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 90 రోజుల్లో పరిష్కారమవ్వాల్సిన కేసుల్లో జాప్యం పెరుగుతోందని, అదనపు బెంచీలు ఏర్పాటు చేస్తే సత్వర పరిష్కారం సాధ్యమంటూ అభ్యర్థనలు పంపుతున్నారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల సంఘం తరఫున ప్రభుత్వానికి లేఖలు పంపారు.

వ్యయ ప్రయాసలతో... రాష్ట్రంలో ఉమ్మడి పది జిల్లాలకు సంబంధించి మొత్తం 12 జిల్లా వినియోగదారుల కమిషన్లు కొనసాగుతున్నాయి. పాత పది జిల్లాల్లో ఒకటి చొప్పున, హైదరాబాద్ జిల్లా జనసాంద్రత దృష్ట్యా హైదరాబాద్ 1, 2, 3 జిల్లా వినియోగదారుల కమిషన్లు కొనసాగుతున్నాయి. రంగారెడ్డి జిల్లా భౌగోళిక విస్తీర్ణం పెరగడం, అభివృద్ధి చెందడంతో వినియోగదారుల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం ఎల్బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో వినియోగదారుల కమిషన్ కొనసాగుతూ అత్యధిక కేసులు పరిష్కరిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ప్రతినెలా 90కి పైగా కేసులు నమోదవుతుండగా 50కి పైగా కేసులు పరిష్కారమవుతున్నాయి. ప్రధానంగా రియల్ ఎస్టేట్ మోసాలు అధికంగా జరుగుతున్న మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో అదనపు జిల్లా కమిషన్లు ఏర్పాటు చేస్తే రెండు జిల్లాల వినియోగదారులకు సౌకర్యంగా ఉంటుందని విన్నవిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా కమిషన్‌లో కేసు వేసి విచారణకు రావడానికి వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి వాసులు వ్యయ ప్రయాసలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎల్బీనగర్‌లోని కమిషన్‌తో పాటు శంషాబాద్, చేవెళ్ల, కూకట్‌పల్లి ప్రాంత ప్రజలకు ఆయా ప్రాంతాల్లో అదనపు కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## సీతారామ.. కరుణ చూపుమా..!

కొత్తగూడెం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. తొలుత గోదావరి నీటిని పాలేరు జలాశయంలోకి మళ్లించేందుకు ప్రణాళికలు రూపొందించి కాల్వ పనులు ప్రారంభించారు. జూలూరుపాడు సమీపంలో టన్నెల్ నిర్మాణానికి అటవీ అనుమతులు రాకపోవటంతో పనులు నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్(ఏన్కూర్) అనుసంధాన కాల్వ ద్వారా గోదావరి నీటిని ఖమ్మం జిల్లాలోని సాగర్ ఎడమ కాల్వలోకి మళ్లించాలని నిర్ణయించింది. రూ.96 కోట్లతో 8.6కి.మీ పొడవైన కాల్వ నిర్మాణ పనులు ప్రారంభించింది. పనులు పూర్తవటంతో గోదావరి జలాలను తరలించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈనేపథ్యంలో 'సీతారామ' ద్వారా భద్రాద్రి జిల్లాకు నీరందించే విషయం చర్చనీయాంశమవుతోంది.

రూ.3,200 కోట్ల అంచనాలతో..

'సీతారామ' తొలిదశలో కీలకంగా ఉన్న రోళ్లపాడు రిజర్వాయర్‌కు ప్రాధాన్యమిచ్చేలా రూ.3,200కోట్ల అంచనాతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గోదావరి జలాలను ఆరు దశల్లో ఎత్తిపోసి ఇల్లెందు నియోజకవర్గంలో 65,483 ఎకరాలకు సాగునీరందించాలనుకున్నారు. మొదట జూలూరుపాడు కెనాల్ ద్వారా సింగరేణి మండలం లలితాపురం చెరువులోకి నీటిని మళ్లించాలని నిర్ణయించారు.



ఇక్కడి నుంచి 216 అడుగుల ఎత్తులోని రోళ్లపాడు రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయాలనుకున్నారు. ఆతర్వాత గ్రావిటీ కాల్వల ద్వారా టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాలకు సాగునీరందించాలని యోచించారు. రోళ్లపాడులో నిర్మించిన లిఫ్ట్ ద్వారా ఇల్లెందు మండలం రొంపేడు దగ్గర నీటిని ఎత్తిపోయాలనుకున్నారు. ఇక్కడి నుంచి బయ్యారం చెరువులోకి నీటిని తరలించేలా ప్రణాళిక రూపొందించారు. గత ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టకపోవటం, తర్వాతరాష్ట్రంలో అధికార మార్పిడి జరగటంతో ఈప్రతిపాదన మరుగునపడింది.

పాత ప్రణాళికను పక్కనబెట్టి.

సీతారామ ప్రాజెక్టుకు అప్పటి సీఎం కేసీఆర్.. టేకులపల్లి మండలం రోళ్లపాడులో 2016 ఫిబ్రవరి 16న శంకుస్థాపన చేశారు. కిన్నెరసాని అభయారణ్యం, రైల్వే ట్రాక్‌లు తదితర కారణాలతో ప్రాజెక్టు ప్రణాళిక, డిజైన్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల్లోని అనేక ప్రాంతాలకు నీరందకుండా పోయింది. అప్పటి ఎమ్మెల్యేల విన్నపం మేరకు పాత ప్రణాళికను పక్కనపెట్టి కొత్త డీపీఆర్‌ను అధికారులు సిద్ధం చేశారు. జూలూరుపాడు కాల్వ నుంచి ఎత్తిపోతల ద్వారా ఇల్లెందు నియోజకవర్గంలోని ఎల్‌టీ బయ్యారం చెరువులోకి నీళ్లొచ్చేలా ప్రణాళిక రూపొందించారు.

సీఎం పర్యటనతో చిగురిస్తున్న ఆశలు

సీతారామ ప్రాజెక్టును సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 15న వైరాలో ప్రారంభించనున్నారు. తలాపున ప్రవహించే గోదావరి జలాలను భద్రాద్రి జిల్లా పంటపొలాలకూ అందించాలనే అంశం తెరపైకి వచ్చింది. గతంలో రూపొందించిన ప్రణాళికను అమలుచేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై బహిరంగ సభలో సీఎం ప్రకటన చేస్తారని ఎదురుచూస్తున్నారు.

## ఆదర్శ 'ఒర'బడి..!

పాల్వంచ : గతేడాది తాగునీరు, మరగుదొడ్లు, ఇతర సమస్యలతో ఇబ్బందులు పడ్డాం. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమే 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ' పథకంలో భాగంగా రూ.4.65 లక్షలతో మా పాఠశాలలో తాగునీటి సదుపాయం కల్పించారు. చిన్నపాటి మరమ్మతులు చేశారు. మరగుదొడ్లను ఆధునీకీకరించారు. విద్యుద్దీకరణ పనులు చేపట్టారు. మధ్యాహ్న భోజన సమయానికి చక్కగా చేతులు శుభ్రం చేసుకుంటున్నాం.

పల్లవి, నాలుగో తరగతి, అబ్బుగూడెం ప్రాథమిక పాఠశాల, అన్నపురెడ్డిపల్లి మండలం

పనుల్లో పురోగతి

సర్కారు బడులను ఆదర్శంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. కార్పొరేట్ బడులకు దీటుగా మార్చాలనే ఉద్దేశంతో 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పనకు 2024 మే



మాసంలో శ్రీకారం చుట్టింది. పర్యవేక్షణ బాధ్యతలను సంబంధిత జిల్లా కలెక్టర్‌కు అప్పగించటంతో పనుల్లో పురోగతి కనిపిస్తోంది. స్వల్ప వ్యవధిలో తక్కువ ఖర్చుతో పనులు పూర్తయ్యేలా రూపొందించిన కార్యాచరణ సత్ఫలితాలనిస్తోంది.

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో తొలి విడతలో ఎంపిక చేసిన పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. క్షేత్రస్థాయిలో మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూరుతున్నాయి. ప్రధానంగా తాగునీరు, విద్యుత్తు సదుపాయం, బాలికల మరుగుదొడ్ల నిర్మాణం, ఇతర మరమ్మతులకు ప్రాధాన్యమిస్తున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో పనులు వేగంగా సాగుతున్నాయి. కలెక్టర్ల ఆదేశాల మేరకు అన్ని రకాల వసతులు సమకూరుతున్నాయి. పనులు చేసిన వారికి వెంటవెంటనే బిల్లులు చెల్లిస్తున్నాం.

వెంకటేశ్వరాచారి, డీఈఓ, భద్రాద్రి కొత్తగూడెం

మిగతాచోట్ల రంగులు, బెంచీలు తదితరాలు సమకూర్చాల్సి ఉంది. ఎంబీ రికార్డు అయిన వెంటనే బిల్లులను 'అమ్మ ఆదర్శ కమిటీ' ఖాతాలో సర్కారు జమచేస్తోంది.



# రిమాండ్ రిపోర్టులో ఐపీఎస్‌ల పేర్లు

విజయవాడ: ముంబయి నటి కాదంబరి జెత్వాని కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న కుక్కల విద్యాసాగర్ రిమాండ్ రిపోర్టును పోలీసులు కోర్టుకు సమర్పించారు. నిందితులుగా పలువురు ఐపీఎస్ అధికారుల పేర్లను అందులో చేర్చారు. ఏ2గా పీఎస్ఆర్ ఆంజనేయులు, ఏ3గా కాంతిరాణా, ఏ4గా వెస్ట్‌జోన్ మాజీ ఏసీపీ హనుమంతరావు, ఏ5గా ఇబ్రహీంపట్నం మాజీ సీఐ సత్యనారాయణ, ఏ6గా విశాల్‌గున్నీ పేర్లు చేర్చారు. ఈ కేసులో ఏపీ ప్రభుత్వం ఇప్పటికే ఐదుగురిని సస్పెండ్ చేసింది. విద్యాసాగర్‌తో కాంతిరాణా, ఆంజనేయులు, విశాల్‌గున్నీ కుమ్మక్కైనట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసులు వెల్లడించారు. కాదంబరి జెత్వానిని అక్రమంగా అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. విద్యాసాగర్‌ను డెహ్రాడూన్ నుంచి రైలులో అర్ధరాత్రి తీసుకొచ్చిన పోలీసులు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, వైద్య పరీక్షల అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి వచ్చే నెల 4 వరకు రిమాండ్ విధించగా.. విజయవాడ సబ్‌జైలుకు తరలించారు.

# 100 ఎకరాల్లో అంతర్జాతీయ న్యాయ కళాశాల: చంద్రబాబు



అమరావతి: కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సోమవారం ఆయన న్యాయశాఖపై సమీక్ష నిర్వహించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రతిపాదనలను త్వరలోనే కేంద్రానికి పంపనున్నట్లు స్పష్టం చేశారు. మంత్రివర్గ భేటీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామన్నారు. అమరావతిలో అంతర్జాతీయ న్యాయ కళాశాల ఏర్పాటుపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్టు ద్వారా 100 ఎకరాల్లో న్యాయకళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. జూనియర్ న్యాయవాదులకు శిక్షణ అకాడమీ ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. అంతకుముందు మైనారిటీ సంక్షేమ శాఖపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. మైనార్టీ సంక్షేమ పథకాల పునర్వ్యవస్థీకరణపై చర్చించారు. కడప హజ్ హౌస్, గుంటూరు క్రిస్టియన్‌భవన్‌ను పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇమామ్‌లకు రూ. 10 వేలు, మౌజన్‌లకు రూ. 5 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయించారు. మైనార్టీలకు లబ్ధి జరిగేలా వక్ఫ్ భూములను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు.

# టీటీడీ ఆస్తులను దోచేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించారు

అమరావతి: తిరుమల శ్రీవారి ఆస్తుల పరిరక్షణ బాధ్యత కూటమి ప్రభుత్వానిదే అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. భక్తులు స్వామిపై విశ్వాసంతో ఆస్తులు ఇచ్చారని అన్నారు. ఆ ఆస్తులను వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన టీటీడీ పాలక మండలి అమ్మే ప్రయత్నం చేసిందని ఆరోపణలు చేశారు. జగన్ ప్రభుత్వం టీటీడీ ఆస్తులను... భగవంతుడి ఆభరణాలకు రక్షణ కల్పించిందా లేదా అనే కోణంలో విచారణ జరిపించాలని పవన్ కళ్యాణ్ కోరారు. భక్తులు ఇచ్చిన ఆస్తులను విక్రయించాలని గత టీటీడీ పాలక మండలి నిర్ణయించి ప్రకటన కూడా ఇచ్చిందని గుర్తుచేశారు. అసలు నాటి పాలక మండలి స్వామి వారి ఆస్తులను పరిరక్షణ కంటే పప్పుబెల్లాల్లా అమ్మేయడానికే ప్రయత్నించిందని మండిపడ్డారు. టీటీడీని ఆ విధంగా నడిపించింది ఎవరు? అనేది బయటకు తీస్తామని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. వేంకటేశ్వర స్వామి వారి ఆస్తులను గత పాలక మండళ్లకు నేతృత్వం వహించినవారు కాపాడారా? వాటిని అమ్మేశారా? అనే సందేహాలు భక్తులకు వస్తున్నాయని పవన్ కళ్యాణ్ అన్నారు. తిరుమల శ్రీవారి ఆస్తులను పరిరక్షించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. టీటీడీ ఆస్తుల విషయంలో గతంలో చేసిన నిర్ణయాలపై సమగ్ర విచారణ చేయించాలని సీఎం చంద్రబాబుని పవన్ కళ్యాణ్ కోరారు. గత పాలక మండలి తమిళనాడులో 23 ఆస్తులను వేలం ద్వారా విక్రయించాలని చూసిందని అన్నారు. ఆ ఆస్తుల విలువ రూ.23.92 కోట్లుగా లెక్కగట్టారని చెప్పారు. టీటీడీ ఆస్తుల విక్రయం ద్వారా రూ.100 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రయత్నించిందని చెప్పారు. చాలా ప్రాంతాల్లో ఉన్న టీటీడీ ఆస్తులను దోచేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించారని పవన్ కళ్యాణ్ ఆరోపించారు. ఆ రోజు ప్రతిపక్ష స్థానంలో ఉన్న పార్టీలు, పలు హిందూ ధార్మిక సంస్థలు బాధ్యతగా, బలంగా స్పందించాయని పవన్ కళ్యాణ్ చెప్పారు. తిరుమల శ్రీవారికి రాజులు, భక్తులు కొన్ని శతాబ్దాలుగా నగలు, ఆభరణాలు అందజేశారని తెలిపారు. ఆ




ఆభరణాల జాబితాను కూడా పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును పవన్ కళ్యాణ్ కోరారు. స్థిరాస్తులను అమ్మేయాలని చూసినవారు శ్రీవారి ఆభరణాలు, బంగారం విషయంలో కూడా కచ్చితంగా ఉన్నారా లేదే అనేదానిపై దృష్టిపెట్టాలని అన్నారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ప్రతి భక్తుడి నుంచి స్పెషల్ దర్శనం కోసం రూ.10,500 తీసుకున్నారని.. భక్తులకు మాత్రం బిల్లు రూ.500కే ఇచ్చారని చెప్పారు. ట్రస్ట్ ఏర్పాటు చేసినప్పటి నుంచి వచ్చిన ఆదాయాన్ని నాటి పాలక మండళ్లు ఎటు మళ్లించాయో కూడా విచారణ చేపట్టాలని పవన్ కళ్యాణ్ కోరారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా అటు కశ్మీర్ నుంచి ఇటు బెంగాల్ వరకూ ఆలయాలు నిర్మిస్తామని అప్పటి పాలకులు చెప్పారని అన్నారు. అసలు ఆ ఆలయాలు ఎవరి ద్వారా నిర్మాణం చేపట్టారు? ఆ సంస్థ ఏమిటి? అనే అంశాలపై సీఎం చంద్రబాబు విచారణ చేపట్టాలని కోరారు. ఎంత మేరకు శ్రీవాణి ట్రస్ట్ ఆదాయం మళ్లించారో భక్తులకు తెలియజేయాలని అన్నారు. దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న అన్ని ఆలయాలు, సత్రాల ఆస్తుల విషయంలోనూ ఒక సమీక్ష చేయాలని కోరారు. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టిన గత పాలకులు దేవుడి మాన్యాలు, ఆస్తుల జోలికి వెళ్లకుండా ఉంటారా అనే సందేహం ప్రజల్లో ఉందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.




# జగన్‌ను రక్షించేందుకు..

## జగకు మరక అంటకుండా.. పందికొవ్వును పుత్తడితో పోల్చిన పొన్నవోలు..

తిరుమల లడ్డూ వివాదం రోజుకో మలుపు తిరుగుతుంది. లడ్డూ తయారీ కోసం ఉపయోగించే నెయ్యిలో జంతు వ్యర్థాలు, కొవ్వు పదార్థాలు కలిశాయని ల్యాబ్ నివేదికలు స్పష్టం చేయడంతో ఈ అంశం దేశ వ్యాప్తంగా కలకలం రేపుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కల్తీ నెయ్యిని తిరుమలకు సరఫరా చేసినా చర్యలు తీసుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ అంశంలో నెయ్యి సరఫరా దారుడితో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన టీటీడీ బోర్డు, మాజీ సీఎం జగన్ నిందితులేనంటూ తీవ్రంగా చర్చ జరుగుతున్న క్రమంలో వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు కల్తీ నెయ్యి మరకలు అంటకుండా ఉండేందుకు ఏపీ ప్రభుత్వం మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి నిదర్శనమే ఆయన ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలు. తన న్యాయవాద బుర్రను ఉపయోగించి నెయ్యి కల్తీకి, గత వైసీపీ ప్రభుత్వానికి సంబంధం లేదని చెప్పడమే కాకుండా.. నెయ్యిలో పందికొవ్వు కలవలేదని చెప్పే ప్రయత్నం చేశారు. ఓవైపు జంతు వ్యర్థాలు, కొన్ని రకాల నూనెలతో నెయ్యిలో కల్తీ జరిగిందని ల్యాబ్ రిపోర్టులు స్పష్టం చేస్తున్న నేపథ్యంలో పొన్నవోలు వ్యాఖ్యలపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జరిగిన పొరపాటుకు చింతించకుండా ఈ తప్పులకు బాధ్యత వహించాల్సిన వ్యక్తులను ఆయన వెనకేసుకురావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

**పందికొవ్వును పుత్తడితో పోల్చి..** తిరుమలకు సరఫరా చేసే నెయ్యిలో పందికొవ్వు కలిపారని చెప్పడం హాస్యాస్పదమని పొన్నవోలు సుధాకర్ రెడ్డి తెలిపారు. తిరుమలకు సరఫరా చేసే నెయ్యి ఖరీదు కిలో రూ.320 కాగా.. అందులో రూ.1400 విలువచేసే పంది కొవ్వును ఎలా కలుపుతారని ప్రశ్నించారు. మార్కెట్‌లో పందికొవ్వు ధర రూ.400 నుంచి రూ.1400 ఉందని చెప్పారు. నెయ్యి కంటే ఖరీదైన వస్తువుతో కల్తీ ఎలా చేస్తారన్నారు. రాగితో బంగారంలో కల్తీ చేయవచ్చని, బంగారంతో రాగిని కల్తీ చేస్తారా అంటూ ప్రశ్నించారు. ఇలా చెప్పడం ద్వారా పందికొవ్వును ఆయన బంగారంతో పోల్చే ప్రయత్నం చేశారు. నెయ్యిలో పంది కొవ్వు కలిసిందని చెప్పడం అవివేకమని చెప్పుకొచ్చారు. అదే సమయంలో కల్తీ జరిగిందని చెబుతున్న నెయ్యిని ప్రసాదాల తయారీలో వాడలేదని పొన్నవోలు చెప్పారు. ఓవైపు కల్తీ జరగలేదంటూనే.. మరోవైపు నెయ్యి కల్తీ జరిగిందంటూ ఆయన చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**కుట్ర చేశారా..!..** తిరుమల లడ్డూ ప్రసాదం తయారీ కోసం ఉపయోగించే నెయ్యిలో జంతు వ్యర్థాలు, కొన్ని రకాల నూనెలు కలిపారని, పందికొవ్వు కూడా కలిసి ఉండవచ్చని ల్యాబ్ రిపోర్టులు స్పష్టం చేశాయి. మరోవైపు న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి ఖరీదైన పందికొవ్వుతో నెయ్యిని కల్తీ చేయడం ఏమిటంటూ ప్రశ్నిస్తున్న తరుణంలో.. కావాలని ఎవరైనా కుట్రకు పాల్పడ్డారా అనే అనుమానాలు వస్తున్నాయి. తిరుమల ప్రసాదం పవిత్రతను అపవిత్రం చేసేందుకు గత ప్రభుత్వంలో ఏదైనా కుట్ర జరిగిందా అనేది విచారణలో తెలియాల్సి ఉంది.



# పక్కన ఖాళీ కుర్చీతో.. సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆతిశీ

ఢిల్లీ: ఢిల్లీ నూతన సీఎంగా ఆతిశీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సమయంలో ఆమె ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. ఆయన కోసం పక్కన కుర్చీని ఖాళీగా ఉంచి, తాను వేరే సీట్లో కూర్చొని బాధ్యతలు చేపట్టారు. దీనికి సంబంధించిన దృశ్యాలను ఆప్ ఎక్స్(ట్విటర్) ఖాతాలో షేర్ చేసింది. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రామాయణంలోని ఓ సందర్భాన్ని ప్రస్తావించారు. "నాకు ప్రస్తుతం భరతుడికి ఎదురైన పరిస్థితే ఉంది. రాముడు వనవాసానికి వెళ్లినప్పుడు.. భరతుడు పాలించాల్సి వచ్చింది. సింహాసనంపై రాముడి పాదుకలు ఉంచి రాజ్యాన్ని ఏలాడు. ఈ కుర్చీ అరవింద్ కేజ్రీవాల్‌ది. నాలుగు నెలల తర్వాత జరిగే ఎన్నికల్లో ఢిల్లీలో మళ్లీ ఆయన అధికారాన్ని చేపడతారని విశ్వసిస్తున్నాను. ఆయన తిరిగివచ్చేవరకు ఈ కుర్చీ ఇక్కడే ఉంటుంది" అని ఆతిశీ అన్నారు. మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొని, జైలుకు వెళ్లి ఇటీవలే విడుదలై వచ్చిన ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్.. సీఎం పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తదుపరి ముఖ్యమంత్రిగా ఆతిశీ పేరును ప్రతిపాదించగా.. ఆప్ ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అంగీకరించడంతో..రెండు రోజుల క్రితం ప్రమాణస్వీకారం చేశారు. ఆమెతో పాటు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ముకేశ్ అహ్లావత్, గోపాల్‌రాయ్, ఇమ్రాన్ హుస్సేన్, కైలాశ్ గహ్లోత్, సౌరభ్ భరద్వాజ్ కేబినెట్ మంత్రులు ప్రమాణం చేశారు.

దీనికిముందు ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ మాట్లాడుతూ.."ఢిల్లీ ప్రజలు ఎన్నికల్లో తీర్పు ఇచ్చేవరకు తాను ముఖ్యమంత్రి కుర్చీపై కూర్చోనని కేజ్రీవాల్ అన్నారు. అయితే గత ఎన్నిల్లో ప్రజల తీర్పు మేరకు ఈ ఐదు సంవత్సరాల పాటు ఆ కుర్చీ ఆయనకే చెందుతుంది. వచ్చే ఎన్నికలు జరిగేవరకు మాలో ఒకరు కుర్చీలో కూర్చుంటారు. రాముడు లేనప్పుడు(రామాయణంలో) భరతుడు అయోధ్యను ఎలా పాలించాడో, మాలో ఒకరు ఢిల్లీకి సీఎంగా ఉంటారు" అని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.



# చైనా రాకెట్ పేలిపోయిందిలా..

చైనాకు చెందిన డీప్ బ్లూ ఏరోస్పేస్ సంస్థ రీయూజబుల్ రాకెట్ కోసం చేసిన ప్రయోగం విఫలమైంది. ఆ సంస్థ అభివృద్ధి చేసిన నెబులా–1 రాకెట్‌కు వర్టికల్ టేకాఫ్, వర్టికల్ ల్యాండింగ్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 11 లక్ష్యాలతో వీటిని నిర్వహించగా.. వాటిలో 10 విజయవంతమయ్యాయి. కానీ, ఒకటి మాత్రం ల్యాండింగ్‌లో మాత్రం విఫలమైంది.

తొలుత విజయవంతంగా గాల్లోకి ప్రయాణించిన రాకెట్ ల్యాండింగ్ ఫేజ్‌లో మాత్రం తడబడింది. నేలపై దిగడానికి కొన్ని క్షణాల ముందు అదుపుతప్పి పేలుడు సంభవించింది. తమ ప్రయోగంలో అత్యధిక భాగం సఫలమైందని డీప్‌బ్లూ సంస్థ పేర్కొంది. దీనికి సంబంధించిన డ్రోన్ దృశ్యాలను కూడా విడుదల చేసింది. తాజాగా ఈ ప్రయోగానికి సంబంధించిన డేటాను తాము విశ్లేషిస్తున్నామని ఆ సంస్థ పేర్కొంది. ఈ సంస్థ చైనాలో అంతరిక్ష రంగంలో అగ్రగామిగా నిలిచేందుకు తీవ్రస్థాయిలో యత్నాలు చేస్తోంది. తాజాగా ప్రయోగించిన రాకెట్‌లో కిరోసిన్‌ను ఇంధనంగా వాడినట్లు డీప్ బ్లూ వెల్లడించింది. దీంతోపాటు మీథేన్, లిక్విడ్ ఆక్సిజన్ వినియోగంపైనా ఈ సంస్థ ప్రయోగాలు చేస్తోంది. రాకెట్ తయారీ ఖర్చును గణనీయంగా తగ్గించడానికి ఇవి ఉపయోగపడతాయని పేర్కొంది. నెబులా–1లో 3డీ ప్రింటెడ్ థండర్–ఆర్1 ఇంజిన్‌ను వినియోగించారు. ఇది 2,000 కిలోగ్రాముల పేలోడ్‌ను దిగువ కక్ష్యలోకి చేర్చగలదు. పేలోడ్ తగ్గేకొద్దీ ప్రయాణదూరం పెరగడం విశేషం. మొత్తం 8 టన్నుల పేలోడ్‌ను దీని సాయంతో అంతరిక్షంలోకి పంపాలనే లక్ష్యంతో అభివృద్ధి చేస్తున్నారు. ఈ సంస్థ మే 2022లో కిలోమీటర్ లెవన్ వీటీవీఎల్ పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. చైనాలో ఈ ఘనత సాధించిన తొలి సంస్థగా నిలిచింది. దీనిలోకి ఈ ఏడాది ఆగస్టు 13న భారీగా పెట్టుబడులు వచ్చాయి.

# మారేడుమిల్లి టూర్‌లో విషాదం.. ఇద్దరు వైద్యవిద్యార్థుల మృతదేహాలు లభ్యం



మారేడుమిల్లి: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి విహారయాత్రకు వెళ్లినవారిలో ఇద్దరు మృతిచెందారు. ముగ్గురు వైద్య విద్యార్థులు గల్లంతు కాగా.. సోమవారం ఉదయం ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. పార్వతీపురం జిల్లా బొబ్బిలికి చెందిన కొసిరెడ్డి సౌమ్య (21), బాపట్లకు చెందిన బి.అమృత (21) మృతదేహాలను గుర్తించారు. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన మరో యువకుడు సీహెచ్ హరదీప్ (20) కోసం గాలింపు కొనసాగుతోంది. సౌమ్య, అమృత మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్నేహితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మారేడుమిల్లి పర్యాటక ప్రాంతానికి ఏలూరులోని ఆశ్రం కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 14 మంది వైద్యవిద్యార్థులు ట్రావెలర్ వాహనంలో ఆదివారం వచ్చారు. మారేడుమిల్లి నుంచి చింతూరు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిలోని 'జలతరంగిణి' జలపాతం వద్దకు చేరుకుని అందులో దిగారు. ఈ క్రమంలో ఒక్కసారిగా భారీవర్షం కురిసింది. జలపాతం ఉద్ధృతి పెరగడంతో అయిదుగురు కొట్టుకుపోయారు. గల్లంతైనవారిలో సౌమ్య, హరదీప్, అమృత, హరిణిప్రియ, గాయత్రి పుష్ప ఉన్నారు. వీరిలో విజయనగరానికి చెందిన హరిణిప్రియ, గాయత్రి పుష్పను ఒడిశా నుంచి విహారయాత్రకు వచ్చిన ఇద్దరు యువకులు కాపాడి, రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. హరిణిప్రియ పరిస్థితి విషమంగా ఉండడంతో రాజమహేంద్రవరం తరలించారు. గల్లంతైన వారికోసం పోలీసులు, సీబీఈటీ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం సౌమ్య, అమృత మృతదేహాలు లభ్యమయ్యాయి. హరదీప్ కోసం గాలింపు కొనసాగుతోంది.

# వైకాపా మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి అనుచరుల అక్రమ నిర్మాణాలు కూల్చివేత

కాకినాడ: వైకాపా మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అనుచరుల అక్రమ నిర్మాణాన్ని అధికారులు కూల్చివేశారు. కాకినాడలోని సంతచెరువు సెంటర్‌లో అక్రమంగా నిర్మించిన దుకాణ సముదాయాన్ని కాకినాడ నగరపాలక సంస్థ అధికారులు తొలగించారు.

జేసీబీతో నిర్మాణాలను కూలగొట్టారు. కూల్చివేతను అడ్డుకునేందుకు ద్వారంపూడి అనుచరులు యత్నించగా.. నిర్మాణాలకు అనుమతులు లేవని నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు. అనంతరం భారీ బందోబస్తు మధ్య కూల్చివేశారు.



# లడ్డూ వివాదం.. జగన్‌పై మంత్రి ఆనం ఘాటు వ్యాఖ్యలు



నెల్లూరు : టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడిచిన 100 రోజుల్లో అనేక మంచి కార్యక్రమాలు చేపట్టామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఆత్మకూరు పట్టణంలోని పేరారెడ్డిపల్లి గ్రామంలో "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రసాదమైన లడ్డులో కల్తీ నెయ్యి వాడి గత పాలకుల దోపిడి చేశారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో పరీక్షలు నిర్వహిస్తే నివేదికలలో జంతువుల కొవ్వు ఉందని స్పష్టం చేశాయన్నారు. మూడు సంవత్సరాలు అనుభవం ఉండాల్సి ఉంటే సంవత్సరం కూడా అనుభవ లేని కంపెనీలకు కట్టపెట్టారన్నారు. జగన్ ముఖ్య మంత్రి అవడానికి సొంత బాబాయినే హత్య చేశారని... తిరుమలను దోచుకోమని మరో బాబాయిని పంపించారంటూ వ్యాఖ్యలు చేశారు. ఇంత అపచారం జరిగి ఉంటే ఏమి తెలియని నంగనాచిలా ప్రధానికి లేఖ రాశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ఒక చీటర్..బ్లాక్ మెయిలర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. కోట్లాది మంది మనోభావాలను దెబ్బ తీశారని జగన్‌పై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## కాజోల్‌లా కాకుండా రవీనా సౌత్ గేమ్ ప్లాన్

రవీనా టాండన్ పరిచయం అవసరం లేదు. ఈ పేరు గుర్తుకు రాగానే బాలకృష్ణ బంగారు బుల్లోడు%-% సినిమా గుర్తుకు వస్తుంది. ఆ సినిమాలో రవీనా టాండన్ గ్లామరస్ యాక్ట్ యూత్ ని ఒక ఊపు ఊపింది. రవీనా బోల్డ్ గ్లామరస్ లుక్స్ కి ఫ్యాన్స్ అయిపోయారు తెలుగు కుర్రాళ్లు. మొహ్రా లాంటి హిందీ సినిమాలో తూ ఛీజ్ బడీ హై మస్త్ మస్త్ పాటలో రవీనా డ్యాన్సులకు మంత్ర ముగ్ధులు కాని వారు లేరు. పూరి జగన్నాథ్ బుడ్డా హోగా తేరా బాప్ చిత్రంలోను రవీనా నటించింది. అదంతా అటుంచితే ఇటీవల కేజీఎఫ్ 2లో రవీనా రాజకీయ నాయకురాలిగా కనిపించింది. ఈ సీనియర్ భామ ఆకర్షణీయమైన రూపానికి, అద్భుత నటనకు మంచి గుర్తింపు దక్కింది. ఇప్పుడు నేరుగా టాలీవుడ్ లో ఓ హారర్ సినిమాలో నటించేందుకు రవీనా సంతకం చేసిందని తెలిసింది. ఈ సినిమా టైటిల్ జటాధార. సుధీర్ బాబు కథానాయకుడిగా నటిస్తున్నాడు. ప్రసిద్ధ దక్షిణ భారత నిర్మాత శివిన్ నారంగ్ నిర్మిస్తున్నారు. ఇది అతీంద్రియ విశ్వానికి సంబంధించిన సినిమా. రవీనా ఇందులో ప్రతినాయక పాత్రలో కనిపిస్తుందని సమాచారం. నిజానికి ఒక



గ్లామరస్ స్టార్ గా ఏలిన రవీనా టాండన్ కేజీఎఫ్ లో తన ఏజ్ కి తగ్గట్టు డిగ్నిఫైడ్ గా ఉండే పాత్రలో నటించారు. ఇప్పుడు ఏకంగా విలన్ పాత్రలో నటిస్తుండడం తనకు పూర్తిగా కొత్త. రవీనా ఈ కొత్త ఛాలెంజ్ ని స్వీకరించి విజేతగా నడుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. KGF: చాప్టర్ 2లో ప్రశంసలు పొందిన నటనతో బాలీవుడ్‌లో గొప్ప ప్రజాదరణను పొందింది. ఈ చిత్రం గురించి ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశం రెండు చోట్లా అందరి దృష్టిలో పడేందుకు రవీనా ఎంపిక అని అర్థమవుతోంది. రవీనా విలన్ పాత్ర పూర్తిగా కొత్తదనంతో రీఫ్రెషింగ్ గా ఉంటుందని కూడా భావిస్తున్నారు. ఇప్పుడు ఈ పాత్ర వర్కవుటైతే రవీనాకు సౌత్ నుంచి అదే తరహాలో మరికొన్ని అవకాశాలు వచ్చేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. బాలీవుడ్ కి చెందిన సీనియర్ కథానాయిక కాజోల్ కూడా దక్షిణాదిన సీరియస్ గా కెరీర్ ని ప్రారంభించింది. కానీ అది ఇక్కడ ఆశించినంతగా వర్కవుట్ కాలేదు. నాలుగైదు సినిమాలకే కనుమరుగైంది. కానీ రవీనా ప్రణాళిక చూస్తుంటే అందుకు పూర్తి భిన్నంగా ఉందని అర్థమవుతోంది.

## పాండే బ్యూటీ సారీ సర్ ప్రైజ్ సంథింగ్ స్పెషల్!

నేటితరంలో స్పీడున్న భామగా అనన్య పాండే పేరు ఎంతో పాపులరైంది. నటవారసుల్లో అనన్య యూనిక్ బ్యూటీ అనిపించింది. వరుస ఫోటోషూట్లతో అమ్మడు నిత్యం నెట్టింట వైరల్ అవుతుంటుంది. అనుభవం కొద్ది రాటు దేల్తారు అన్నట్లు అనన్య కూడా ఫ్యాషన్ వరల్డ్ లో అలాగే రాటుదేలుతోంది. ఫ్యాషన్ ఎంపికల్లో తనదైన మార్క్ వేస్తుంది. ఇప్పటికే సెగలు పుట్టించే ఫోటోలతో కుర్రాళ్ల గుండెల్లో గుబులు పుట్టించింది. తాజాగా ట్రెడీషనల్ దుస్తుల్లోనూ తానేం తక్కువ కాదని ప్రూవ్ చేసింది. ఇదిగో ఇక్కడిలా డిజైనర్ చీరలో అనన్యా అంతులేని అందంతో అలరించింది. ఇక్క క్షణం పాటు ఆమె అనన్యా? చూస్తున్నకళ్లు అనన్యనే చూస్తున్నాయా? అన్నంత ఆశ్చర్యానికి గురిచేసేంత అందంగా ముస్తాబైంది. షోల్డర్ లెజ్ డిజైనర్ చీరలో



అనన్య అలంకరణ సంథింగ్ స్పెషల్ గా ఆకట్టుకుంటుంది. ఓ అవార్డు ఫంక్షన్ కోసం అమ్మడు ఇలా ముస్తాబైంది. భుజాలపై వేసుకోవాల్సిన పైట కొంగును చేతులపై వేసుకుని చీర బ్యూటీలో సంథిగ్ స్పెషల్ అనిపించింది. ఇక అమ్మడు మ్యాకప్ ముస్తాబైన విధానం గురించి చెప్పాల్సిన పనిలేదు. అలంకరణలో నాకెవ్వరూ పోటీ అన్నట్లే ముస్తాబైంది. వివిధ భంగిమల్లో అమ్మడు ఇచ్చిన ఫోజులు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అమ్మడి బ్యూటీకి నెటి జనులంతా ఫిదా అవుతున్నారు. తమస్టైల్లో కామెంట్లతో ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక బాలీవుడ్ లో అమ్మడి కెరీర్ గురించి చెప్పాల్సిన పనిలేదు.తెలుగులో లైగర్ ఫ్లాప్ అయిన అనంతరం అక్కడ ఏమాత్రం సమయం వృద్ధా చేయకుండా బాలీవుడ్ కి వెళ్లిపోయింది. లక్కీగా అవకాశాలు బాగానే అందుకుంది. ఇప్పుడిప్పుడే సక్సెస్ బ్యూటీగా పికప్ అవుతుంది. ప్రస్తుతం అమ్మడి చేతిలో రెండు..మూడు సినిమాలున్నాయి.




## ఇండస్ట్రీలో సూపర్ స్టార్ గురువు ఈయనే!



ఇండస్ట్రీలో సూపర్ స్టార్ రజనీకాంత్- కమల్ హాసన్ ల గురువు ఎవరు? అంటే లెజెండరీ డైరెక్టర్ బాల చందర్ పేరుచెబుతారు. ఇరువురు అంత పెద్ద స్టార్లగా ఎదిగారంటే? కారణం బాలచందర్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. బాల చందర్ సినిమాలోతనే ఇద్దరు వెలుగులోకి వచ్చారు. నటనలో వాళ్లిద్దరు గురువు బాల చందర్. అయితే రజనీకాంత్ కి మరో గురువు కూడా ఉన్నారు? అన్న సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వృత్తిలోనే కాదు..వ్యక్తిగతంగానూ గాను రజనీకాంత్ మరో లెజండరీని గురువుగా స్వీకరించారు. ఆయనే బిగ్ బీ అమితాబచ్చన్. అవును ఈ విషయం స్వయంగా రజనీకాంత్ ఓ వేడుక సందర్భంగా తెలిపారు. వృత్తిగతంగానూ ..వ్యక్తిగతంగానూ రజనీకాంత్ తన గురువుగా అమితాబ్ పేరును చెప్పడం విశేషం. 'వెట్టేయాన్' ప్రీ రిలీజ్ వేడుకలో ఈ సంగతి చెప్పారు. రజనీకాంత్ హీరోగా జ్ఞాన్ వేల్ తెరకెక్కించిన సినిమా ఇది. ఇందులో అమితాబచ్చన్ కూడా కీలకపాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఈసినిమాలో అమితాబచ్చన్ నటిస్తానని ఒప్పుకున్నప్పుడు నాకెంతో సంతోషంగా కలిగింది. నా లో తెలియని ఉత్సాహం మొదలైంది. ఇంతవరకూ ఎన్నో సినిమాలుచేసాను. కానీ అమితాబ్ తో కలిసి పనిచేస్తున్నాను అనే విషయం నాలో జోష్ ని నింపింది. ఎందుకంటే ఆయన్ని నేను ఓ గురువుగా భావిస్తా. ఆయన నటన అంటే ఎంతో ఇష్టం' అన్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గామారాయి. ఇంతవరకూ ఈ విషయాన్ని రజనీకాంత్ తన మనసులోనే ఉంచుకున్నారు. తొలిసారి తన మనసులో భాబాల్ని బట్ట పెట్టి అమితాబ్ స్థానాన్ని చెప్పడం విశేషం. ఇక అమితాబ్ ఈ మధ్య సౌత్ సినిమాలు ఎక్కువగా చేస్తోన్న సంగతి తెలిసిందే. చిరంజీవితో 'సైరా నర సింహారెడ్డి'లో నటించారు. ఇటీవల రిలీజ్ అయిన 'కల్కి 2898'లోనూ నటించారు. తాజాగా 'వెట్టేయాన్' కూడా చేరింది.

## దేవర హిందీ లెక్కల సంగతేంటి?




మ్యాన్ ఆఫ్ ది మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, మాస్ డైరెక్టర్ కొరటాల శివ కాంబోలో తెరకెక్కుతున్న దేవర పార్ట్-1 రిలీజ్ కు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. సెప్టెంబర్ 27వ తేదీన ప్రపంచవ్యాప్తంగా సందడి చేయనుంది. ఆర్ఆర్ఆర్ తర్వాత తారక్ చేస్తున్న సినిమా కావడంతో మంచి అంచనాలే ఉన్నాయి. మేకర్స్ వాటిని మరింత పెంచే కంకణం కట్టుకున్నారు! పక్కా ప్లాన్ తో ప్రమోషన్స్ చేపడుతూ పాజిటివ్ బజ్ క్రియేట్ చేస్తున్నారు. ఇప్పటి వరకు మేకర్స్ రిలీజ్ చేసిన గ్లింప్సెస్, సాంగ్స్, టీజర్, ట్రైలర్ కు ఊహించని రెస్పాన్స్ వచ్చింది. త్వరలో ఆయుధ పూజ సాంగ్ ను విడుదల చేయనున్నారు మేకర్స్. రీసెంట్ గా సెకండ్ ట్రైలర్ ను రిలీజ్ చేశారు. దానితో సినిమాపై ఉన్న అంచనాలు ఆకాశాన్ని తాకేలా చేశారు. ఒక్కో కంటెంట్ తో సినీ ప్రియులతో పాటు తారక్ అభిమానుల్లో ఎక్స్పెక్టేషన్స్ ను పెంచేస్తున్నారు. దీంతో దేవర పార్ట్-1 కోసం అంతా ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. అయితే సినిమాను పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ చేయనున్న మేకర్స్.. అందుకు తగ్గట్లే ప్రమోషన్స్ చేస్తున్నారు. థియేట్రికల్ బిజినెస్ కూడా భారీగానే జరిగినట్లు టాక్. తెలుగు రాష్ట్రాల్లో రూ.113 కోట్లకు పైగా జరిగినట్లు తెలుస్తోంది. కర్ణాటకలో రూ.15 కోట్లు, తమిళనాడులో రూ.6 కోట్ల మేరకు ప్రీ బిజినెస్ జరిగింది. కానీ ఇప్పుడు చర్చంతా నార్త్ బిజినెస్ పైనే. మరో ఐదు రోజుల్లో సినిమా రిలీజ్ అవుతున్నా.. అసలు క్లారిటీ రావడం లేదు! హిందీ థియేట్రికల్ రైట్స్ ను ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ అనిల్ తడానీ భారీ మొత్తానికి దక్కించుకున్నారని అప్పట్లో వార్తలు వచ్చాయి. కానీ రూ.15 కోట్లకు దేవర థియేట్రికల్ రైట్స్ (నార్త్) డీల్ సెట్ అయిందని ఇప్పుడు తెలుస్తోంది. అంటే ఉత్తరాది దేవరలో రూ.30-35 కోట్ల షేర్ వసూళ్లు సాధిస్తే చాలు.. మూవీ హిట్ అయినట్లే. అయితే దేవర మేకర్స్.. బీ టౌన్ లో ప్రమోషన్స్ భారీగా చేపట్టారు. వివిధ ఇంటర్వ్యూలతో నార్త్ సినీ ప్రియుల్లో ఇంట్రెస్ట్ క్రియేట్ చేశారు. దీంతో అక్కడ దేవర.. రూ.8-10 కోట్ల మధ్య ఓపెనింగ్స్ సాధించే అవకాశం ఉందని అంతా అంచనా వేస్తున్నారు. ఒకవేళ రూ.5-6 కోట్ల మధ్య ఓపెనింగ్స్ వచ్చినా.. పాజిటివ్ మౌత్ అందుకుంటే.. ఇక తిరుగులేదు. బ్రేక్ ఈవెన్ టార్గెట్ ను పూర్తి చేసుకోవడమే కాదు.. మంచి రెస్పాన్స్ దక్కించుకుంటుంది. భారీ వసూళ్లను కచ్చితంగా సాధిస్తుంది. సూపర్ హిట్ గా నిలుస్తుంది. మరేం జరుగుతుందో తెలియాలంటే కొన్ని రోజుల పాటు వేచి చూడాలి.

## అనిత ఓ అనిత పెళ్లికి ముందు లవ్ స్టోరీ!

ఒకప్పటి హాట్ బ్యూటీ అనిత యూత్ లో ఎంతటి క్రేజీ బ్యూటీ అన్నది చెప్పాల్సిన పనిలేదు. 'నువ్వు నేను' హిట్ తో ఓ రేంజ్ లో పేమస్ అయింది. ఆ తర్వాత అదే ఉదయ్ కిరణ్ తో 'శ్రీరామ్' అనే మరో సినిమా చేసింది. ఇంకా 'తొట్టిగ్యాంగ్'..'నిన్నే ఇష్టపడ్డాను', 'అదంతే అదోటైపు' లాంటి కామెడీ చిత్రాల్లోనూ అనిత మెప్పించింది. ముఖ్యంగా అమ్మడి యాటిట్యూడ్ కి పిచ్చ ఫాలోయింగ్ ఉండేది. అప్పుడు సోషల్ మీడియా లేదు కాబట్టి అనిత గురించి సినిమా జనాలకి తప్ప బయట జనాల్లో హైలైట్ కాలేదు. కాల క్రమంలో అవకాశాలు తగ్గడంతో వివాహం చేసుకుని స్థిరపడిపోయింది. అప్పుడప్పుడు ఫ్యామిలీతో కలిసి దిగిన ఫోటోలు షేర్ చేస్తుంటుంది. తాజాగా అనిత పెళ్లికి ముందు నడిపించిన లవ్ స్టోరీ గురించి చెప్పి సర్ ప్రైజ్ చేసింది. 'గతంలో నేను ఈజాజ్ అనే వ్యక్తితో రిలేషన్ లో ఉన్నాను. మా ప్రేమ



గురించి అమ్మకు తెలిసి బాధపడింది. మా మతాలు వేరు కావడంతోనే అమ్మ కంగారు పడేది. అయినా అవేం పట్టించుకోలేదు. ఇద్దరం ఎవరికి వారు బాగానే ఉండేవాళ్లం. కానీ కలిసినప్పుడే మా బంధం వర్కౌట్ కాలేదు. అవతలి వారికి నచ్చినట్లుగా మార్చుకుంటే అది ప్రేమ అనిపించుకోదు. తను నన్ను మార్చాలనుకున్నప్పుడు నా కస్సలు అర్దం కాలేదు. అతడి ప్రేమలో నిండా మునిగి ఉన్నాను. కానీ ఒకరి గురించి నేను మారడం ఏంటి? అని ఆలోచించాను. దీంతో మా బంధం కొనసాగలేదు. విడిపోయిన తర్వాత ఆ బాధ నుంచి కోలుకోవడానికి ఏడాది సమయం పట్టింది. ఇంట్లో ఉండలేక బెస్ట్ ఫ్రెండ్ ఇంటికి వెళ్లిపోయాను. ఆ ఏడాది అంతా తనే నన్ను దగ్గరుండి చూసుకునేది. ఎవరి కోసమే మనం మారాల్సిన పనిలేదు. అలాగే మన పార్టనర్ ఫోన్ పైనా కన్నేసి ఉండాలి. చేతికి ఫోన్ ఇవ్వడానికి భయపడుతున్నాడు? అంటే అక్కడ ఏదో తప్పు జరుగుతున్నట్లే భావించాలి' అని తెలిపింది.

## రష్మికలో ఈ కొత్త కోణం చూశారా?

పుష్పలో శ్రీవల్లిని, గీత గోవిందంలో గీతను అంత తేలిగ్గా మర్చిపోగలరా? అలాగే ఇప్పుడు మిలన్ ఫ్యాషన్ వీక్ 2024లో రష్మిక మందన లుక్స్ ని మర్చిపోవడం కూడా కుదరదు. ఇదిగో అందుకు ఎగ్జాంపుల్ ఈ కొత్త ట్రెండీ లుక్. కావాలంటే మీరే చూడండి. రష్మికను ఇలా కొత్తగా ట్రెండీగా చూడడం ఇదే మొదటి సారి కాకపోవచ్చు.. కానీ ఈసారి తనలో రెబలిజం హద్దుమీరింది. పాశ్చాత్యధోరణి పరాకాష్టలో కనిపిస్తోంది. అయితే దీనికి కారణం లేకపోలేదు. అది డిజైన్ చేసింది పాశ్చాత్య డిజైనర్ కాబట్టి.. అందుకు సంబంధించిన మూలాలు ఈ డిజైనర్ డ్రెస్ లో ఉన్నాయి. రష్మిక మందన్న మిలన్‌లో ప్రజలకు మత్తెక్కిస్తోంది. అక్కడ ఫ్యాషన్ ఈవెంట్లలో ఈ భామ చాలా సరదాగా గడుపుతోంది. శనివారం మిలన్ ఫ్యాషన్ వీక్ ఆఫ్టర్ పార్టీకి రష్మిక హాజరయ్యారు. ఈ సందర్భంగా రష్మిక ధరించిన స్పెషల్ డ్రెస్ ఈవెంట్ కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అందరిలోను రష్మిక షో స్టాపర్ గా నిలిచింది. ఇంతకీ దీనిని డిజైన్ చేసినది ఎవరు? అంటే రష్మికతో పాటు ఫోటోల్లో కనిపించిన ఇటాలియన్ ఫ్యాషన్ డిజైనర్ డోనాటెల్లా వెర్సాస్. వెర్సాస్ ప్రస్తుత చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్



అయిన డోనాటెల్లా, రష్మిక సహా ప్రపంచం నలుమూలల నుండి ప్రముఖులు ఈ ఆఫ్టర్ పార్టీలో పాల్గొనగా..స్పాట్ లో రష్మిక హైలైట్ అయింది. రష్మిక అద్భుతమైన ఐవరీ బ్లేజర్ డ్రెస్, గ్లామ్ మేకప్‌లో కనిపించింది. డోనాటెల్లా తన ప్రక్కనే ఉండి నవ్వుతూ పోజులిచ్చింది. షేర్ అయిన ఫోటోల రంగులరాట్నంలో హ్యూంజిన్, నార్మానీ, జిగి హడిద్, గియాకోమో జార్జియో, బీట్రైస్ వెంద్రామిన్, నవా మౌ , డెనిస్ కాపెజ్జా, జీన్ గల్లాఘర్ లాంటి ప్రముఖులు ఉన్నారు. డోనాటెల్లా టైమ్‌లైన్‌లో రష్మిక పోస్ట్ ని చూసి దక్షిణాది సినీప్రియులు సంతోషించారు. నేను ఆమెకు అభిమానిని కాదు కానీ తన గురించి చాలా గర్వపడుతున్నాను. ఆమె ఒక సాధారణ కుటుంబం నుండి వచ్చింది. మోడలింగ్ చేసింది.. సినిమాల్లో నటించడానికి ప్రయత్నించింది. చాలా అనవసరమైన ద్వేషాన్ని ఎదుర్కొంది. కానీ ఆమె పట్టించుకోలేదు. చాలా భాషలు నేర్చుకుంది. నటనలో కష్టపడి ఇప్పుడు ఈ స్థాయికి ఎదిగింది. అన్నింటికీ తన కష్టమే కారణం. ఆమె సాధించడానికి ఇంకా చాలా మంచి విషయాలు ఉన్నాయని అనుకుంటున్నాను. నేను ఆమెకు మంచి జరగాలని కోరుకుంటున్నాను.. అని రెడ్డిట్‌లో ఒక వ్యక్తి రాశాడు. ఈ అమ్మాయికి ఆకాశమే హద్దు అని ఒకరు రాసారు. కొరియన్ల మధ్య భారతీయతను రష్మిక ఆవిష్కరించిందని ఒకరు ప్రశంసించారు. రష్మిక రెబలిజం హద్దు మీరుతోంది అంటూ ఒక ఫ్యాషన్ ప్రియుడు సరదాగా వ్యాఖ్యానించారు.




మాదాపూర్: హైదరాబాద్‌లో ఆక్రమణల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. మాదాపూర్‌లో అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తోంది. కావూరి హిల్స్‌లోని పార్కు ప్రాంతంలో ఆక్రమణలను అధికారులు తొలగిస్తున్నారు. పార్కులో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ అకాడమీపై గత కొంతకాలంగా కావూరి హిల్స్ అసోసియేషన్ ఫిర్యాదు చేస్తోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం అకాడమీ నిర్మాణాలను తొలగించారు. అనంతరం అక్కడ కావూరి హిల్స్ పార్కు అని బోర్డు ఏర్పాటు చేశారు. మరోవైపు దీనిపై స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు స్పందించారు. కావూరి హిల్స్ అసోసియేషన్ తమకు 25 ఏళ్లకు లీజుకు ఇచ్చిందన్నారు. ఆ గడువు ముగియక ముందే నిర్మాణాలను అన్యాయంగా తొలగిస్తున్నారని ఆరోపించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ కోర్టు ఆదేశాలతో అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు స్పష్టం చేశారు.

## హైడ్రా కూల్చివేతలపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే ఘాటు వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 23: శనివారం, ఆదివారం వస్తుందంటే హైదరాబాద్‌లో ప్రజలు భయంతో ఉండాల్సిన పరిస్థితి ఉందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వ్యాఖ్యలు చేశారు. కూకట్‌పల్లి నల్ల చెరువులో హైడ్రా (%న్ణ=ూ%)కూల్చివేతలపై సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా కమిషనర్ వ్యాఖ్యలకు ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. కూల్చివేతలు చేశాక డెబ్రిస్ తీసివేయకుండా, చెత్తను జమ చేస్తున్నారని తెలిపారు. నల్ల చెరువులో నిన్న (ఆదివారం) కూల్చివేతలు చేపట్టిన స్థలం పట్టదారులకు చెందిందని.. పట్టాదారులకు ఏ విధమైన న్యాయం చేయనున్నారని ప్రశ్నించారు. చెరువులలో పట్టాలు ఉన్న వారికి నష్ట పరిహారం చెల్లించి, ఆ స్థలాన్ని ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిన్న షెడ్లు కూల్చివేస్తున్న సమయంలో అక్కడ ఉంటున్న వారికి కనీసం వారి సామాన్లను తరలించేందుకు కూడా సమయం ఇవ్వకపోవడం దురదృష్టకరమని మండిపడ్డారు. హైడ్రా విధి విధానాలను స్పష్టం చేయాలన్నారు. రాత్రి నోటీసులు ఇచ్చి, ఉదయాన్నే కూల్చి వేస్తే అక్కడ ఉంటున్న వారి పరిస్థితి ఏంటి అంటూ మండిపడ్డారు. నిన్న కూల్చివేతలలో నష్టపోయిన వారికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. శనివారం, ఆదివారం హైడ్రా కాదు హైడ్రామా చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా నిన్న కూల్చివేతలు చేపట్టారని విమర్శించారు. ప్రజలను సంక్షేమ పథకాల నుంచి దారి మళ్లించేందుకు హైడ్రా కూల్చివేతలు చేస్తున్నారని మాధవరం కృష్ణారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.




**నేలమట్టం...** కాగా.. కూకట్‌పల్లిలో, అమీన్‌పూర్ మునిసిపాలిటీలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలో ప్రభుత్వ భూముల్లోని నిర్మాణాలను నిన్న హైడ్రా నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. కూకట్‌పల్లి శాంతినగర్‌లోని నల్లచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో, కిష్టారెడ్డిపేటలోని ఎకరంపైగా, పటేల్‌గూడలోని మూడు ఎకరాలకుపైగా విస్తీర్ణంలోని నిర్మాణాలను కూల్చివేసింది. రెవెన్యూ, నీటి పారుదల, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి హైడ్రా బృందం కూల్చివేతలు చేపట్టింది. మూడు ప్రాంతాల్లోని 8ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణలు, భవనాలు తొలగించినట్టు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అయితే తమ సామాన్లను కూడా తీసుకునే సమయం ఇవ్వకుండా నిర్మాణాలు నేలమట్టం చేశారని బాధితులు లబోదిబోమన్నారు. అప్పులు చేసి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే తాము హైడ్రా చర్యతో రూ.లక్షల్లో నష్టపోయి రోడ్డున పడ్డాయని ఆవేదన చెందారు.

## బీఆర్ఎస్ నేతల అరెస్ట్‌ను ఖండించిన కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 23: గాంధీ ఆస్పత్రి వద్ద బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడాన్ని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ.. "ప్రభుత్వాస్పత్రుల్లో ఉన్న పరిస్థితులను తెలుసుకునేందుకు వెళ్లిన త్రిసభ్య కమిటీ సభ్యులను అరెస్ట్ చేయటమా.. అసలు ప్రభుత్వానికి ఎందుకంత భయం.. కమిటీ తన పని తాను చేసుకొని పోతే నిజం బయటపడుతుందనా.. అసమర్థ చేతగాని ప్రభుత్వం అసలు రంగు బయట పడుతుందనా" అంటూ ట్వీట్ చేశారు.. "నిజంగా ప్రభుత్వం ఏమీ దాచటం లేదంటే బీఆర్ఎస్ నిజ నిర్ధారణ కమిటీని దర్యాప్తు చేయనివ్వండి. కమిటీ నివేదిక ద్వారా ప్రజలు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వానికి తెలుస్తాయి. ప్రజారోగ్యాన్ని మరింత మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రభుత్వానికి సూచనలు అందుతాయి. కానీ ముఖ్యమంత్రి మాత్రం అవేవి జరగవద్దన్న ఇగోతో వ్యవహరిస్తున్నాడు. తెలంగాణ ప్రజల జీవితాలతో సీఎం చెలగాటం ఆడుతున్నాడు. ఇలాంటి పిచ్చి పనులను సీఎం మానేయాలని విజ్ఞప్తి చేస్తున్నా" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## 'కుల గణన' పేరు చెప్పడానికే ప్రధాని భయపడుతున్నారు: రాహుల్

దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భాజపాపై మండిపడ్డారు. భాజపా బహుజన వ్యతిరేకి ఆయన ఆరోపించారు. కేంద్రం తమకు వ్యతిరేకంగా ఎన్ని ప్రచారాలు చేసినా.. రిజర్వేషన్లను కాపాడుకుంటామన్నారు. 'కుల గణన' పేరు చెప్పడానికే ప్రధాని భయపడుతున్నారని, బహుజనులు వారి హక్కులను పొందడం బహుశా ఇష్టం లేదేమోనని సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. "బహుజన వ్యతిరేక భాజపా ఎన్ని అబద్ధాలు వ్యాప్తి చేసినా - రిజర్వేషన్లకు నష్టం జరగనివ్వం. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించి సమగ్ర కులగణన జరిపి ప్రతీ వర్గానికి హక్కులు, వాటా, న్యాయం జరిగేవరకు ఆగబోము" అని రాహుల్ అన్నారు. కులగణన అనేది దేశంలోని రాజకీయ సమస్య మాత్రమే కాదని, వెనకబడిన వర్గాల వారికి న్యాయం చేయడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఇప్పటికే పలుమార్లు రిజర్వేషన్ల గురించి మాట్లాడిన విషయం తెలిసిందే. ఇటీవల అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ రిజర్వేషన్ల అంశంపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ప్రస్తుతం భారత్‌లో ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు



సరైన ప్రాధాన్యం దక్కడం లేదని రాహుల్ గాంధీ అన్నారు. అప్పటివరకు అభివృద్ధిలో వారి భాగస్వామ్యం అంతంతమాత్రంగానే ఉందన్నారు. దేశంలో అన్నివర్గాల వారికి పారదర్శకంగా అవకాశాలు లభించే పరిస్థితులు వచ్చిన తర్వాతే రిజర్వేషన్ల రద్దు గురించి తమ పార్టీ ఆలోచిస్తుందని వ్యాఖ్యానించారు. దీంతో ఆయన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. రాహుల్‌పై విమర్శలు వచ్చాయి. దీంతో ఆయన తన వ్యాఖ్యలపై క్లారిటీ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## ఆ విషయంలో కేటీఆర్‌వి నిరాధార ఆరోపణలు : కాంగ్రెస్ ఎంపీ మల్లు

హైదరాబాద్ : అమృత్ పథకం టెండర్ల విషయంలో మాజీ మంత్రి కేటీఆర్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ధ్వజమెత్తారు. సృజన్‌రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి సతీమణికి సొంత తమ్ముడు కాదని, బాబాయ్ కొడుకు అవుతాడని, ఈ విషయంలో కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆన్‌లైన్‌లో టెండర్లు వేసిన అమృత్ పథకంలో ఆయన.. తన కంపెనీకి జాయింట్ వెంచర్‌లో కాంట్రాక్టు పొందారని, అక్కడ అక్రమాలకు తావులేదని మల్లు రవి తెలిపారు. భాజపా ప్రభుత్వం ఉన్న కేంద్రంలో టెండర్లలో సీఎంకు ఎలాంటి సంబంధం లేదనే విషయం ఆలోచించకుండా కేటీఆర్ బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇలా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. భారాస పదేళ్లలో చేయలేని పనులు సీఎం రేవంత్‌రెడ్డి పది నెలల కాలంలో చేస్తుంటే ఇలాంటి



నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. భారాస ప్రతిపక్షంగా పనిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని, లేకపోతే రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా లేకుండాపోతుందని హితవు పలికారు.

## హెచ్‌సీఏ వ్యవహారంపై విచారణ జరిపించండి : భువనగిరి ఎంపీ

హైదరాబాద్ : హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్)లో టెండర్ ప్రక్రియ, రవాణా సేవలు సహా ఇతర కాంట్రాక్టు వ్యవహారాలపై దర్యాప్తు జరపాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి విజిలెన్స్ అదనపు డీజీకి లేఖ రాశారు. క్యాటరింగ్, రవాణా సేవల కోసం టెండర్ ప్రక్రియపై యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు.

ఇది అసోసియేషన్ పనితీరును ప్రభావితం చేస్తోందన్నారు. అపెక్స్ కౌన్సిల్‌తో సరైన సంప్రదింపులు లేకుండా నిర్ణయాధికారాలు కొంతమంది(అధ్యక్ష, సెక్రటరీ) వ్యక్తుల చేతుల్లోనే ఉన్నాయన్నారు. టెండర్ లేకుండా ఐపీఎల్ కాంట్రాక్టులు ఇవ్వడం వంటి నిర్ణయాలు హెచ్‌సీఏ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తాయన్నారు. హెచ్‌సీఏలో న్యాయబద్ధత, జవాబుదారీతనాన్ని నిర్ధరించేందుకు అన్ని టెండర్లలో సరైన ప్రక్రియను అనుసరించడం చాలా అవసరమని లేఖలో పేర్కొన్నారు.
ఆదాయం, వ్యయానికి సంబంధించిన పారదర్శకత లేకపోవడం బాధాకరమన్నారు. దీంతోపాటు మ్యాచ్‌ల సమయంలో రద్దీని క్రమబద్ధీకరించేందుకు, భద్రతను మెరుగుపరచడానికి ఉప్పల్ స్టేడియంలో మల్టీలెవల్ పార్కింగ్ అవసరమన్నారు. ఈ విషయాలపై విచారణ ప్రారంభించి, హెచ్‌సీఏ సమగ్రతను పునరుద్ధరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన లేఖలో కోరారు.




## చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం నేరమే.. సుప్రీంకోర్టు కీలక తీర్పు

దిల్లీ: చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం నేరం కాదని మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం, ఆ వీడియోలను డౌన్‌లోడ్ చేసుకోవడం పోక్సో చట్టం కింద నేరమేనని వెల్లడించింది. ఈమేరకు మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును అత్యున్నత న్యాయస్థానం పక్కనబెట్టింది. ఇలాంటి తీర్పునిచ్చి హైకోర్టు ఘోరమైన తప్పిదం చేసిందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కేంద్రానికి పలు సూచనలు చేసింది. పోక్సో చట్టంలో 'చైల్డ్ పోర్నోగ్రఫీ' అనే పదాన్ని 'చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూసివ్ మెటీరియల్' అనే పదంతో మారుస్తూ పోక్సో చట్టానికి సవరణలు చేయాలని పార్లమెంట్‌కు తెలిపింది. ఆ సవరణలు అమల్లోకి వచ్చేవరకు దీనిపై ఆర్డినెన్స్ జారీ చేసుకోవచ్చని తెలిపింది. ఇకపై కోర్టులు 'చైల్డ్ పోర్నోగ్రఫీ' పదాన్ని ఉపయోగించవద్దని ఆదేశించింది. చైల్డ్ పోర్నోగ్రఫీని డౌన్‌లోడ్ చేసుకున్నాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుడిపై క్రిమినల్ చర్యలను నిలిపివేస్తూ జనవరి 11న మద్రాసు హైకోర్టు ఆదేశాలిచ్చింది. పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం.. చైల్డ్ పోర్నోగ్రఫీని చూడటం తప్పేమీ కాదంటూ ఆ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న 28 ఏళ్ల యువకుడు వీడియోలు చూడటం తప్ప ఏమీ చేయలేదని, వాటిని ఇతరులకూ పంపలేదని పేర్కొంది. పోర్నోగ్రఫీకి అలవాటుపడిన యువతను శిక్షించడం కన్నా వారిని సరైన మార్గం వైపు నడిపించడంపై దృష్టి పెట్టాలని అభిప్రాయపడింది. ఈ తీర్పుపై పలు ఎన్జీవోలు, చిన్నారుల సంక్షేమ సంఘాలు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. వీటిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. హైకోర్టు తీర్పును తోసిపుచ్చింది. సదరు యువకుడిపై క్రిమినల్ చర్యలను పునరుద్ధరించింది.

## మంత్రి కోమటిరెడ్డికి విలువలు లేవు... గొంగడి సునీత విసుర్లు



హైదరాబాద్: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి విలువలు లేవని... ఆయన నోటికి ఏది వస్తే అది మాట్లాడుతారని బీఆర్ఎస్ సీనియర్ నేత గొంగడి సునీత ఆరోపించారు. బీఆర్ఎస్‌ను ఖతం చేస్తామని.. మంత్రి కోమటిరెడ్డి కలలు కంటున్నారని విమర్శించారు. ఇవాళ(సోమవారం) తెలంగాణ భవన్‌లో గొంగడి సునీత మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి కోమటిరెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కోమటిరెడ్డి లాంటి నేతలు ఎంతమంది వచ్చిన బీఆర్ఎస్ పార్టీని ఏం చేయలేరని అన్నారు. కోమటిరెడ్డి కుటుంబంలో గొడవలను ఆయన మొదటగా పరిష్కరించుకోవాలని హితవు పలికారు. అమెరికా వెళ్లి కేటీఆర్, హరీష్‌రావులు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకరరావుని కలిశారని కోమటిరెడ్డి మాట్లాడుతున్నారని చెప్పారు. 'సీఎం రేవంత్ రెడ్డితో పాటు.. కోమటిరెడ్డి అమెరికా వెళ్లారని.. మీరు కూడా ప్రభాకరరావును కలిసినట్లేనా అని ప్రశ్నించారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి అంటే మాకు గౌరవముంది... ఆయన మాట్లాడే తీరు సరిగాలేదు" అని మండిపడ్డారు. గతంలో మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రాజగోపాలరెడ్డిని గెలిపించాలని ఫోన్ చేసి చెప్పిన ఘనత కోమటిరెడ్డిది అని గొంగడి సునీత విమర్శించారు.

## మహిళా ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేయడంలో ఉద్దేశమేంటి: సునీతా లక్ష్మారెడ్డి



మెదక్: తన ఇంటిపై దాడి జరిగిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తెలిపారు. గోమారంలోని తమ ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తలు కావాలనే దాడి చేశారని ఆరోపించారు. "మా ఇంటి ముందు కావాలనే టపాసులు కాల్చారు. లోనికి వచ్చి ఇద్దరిపై దాడి చేశారు. మహిళా ఎమ్మెల్యే నివాసం వద్దకు వచ్చి ఇలా చేయడంపై ఉద్దేశం ఏంటి? వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి. మా కార్యకర్తలపై దాడులు చేస్తే ఊరుకోం. ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తిపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారు. టపాసులు పేలుస్తూ గేటు నుంచి లోపలికి ముగ్గురు వ్యక్తులు వచ్చారు" అని సునీతా లక్ష్మారెడ్డి తెలిపారు. సునీతా లక్ష్మారెడ్డితో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మాట్లాడారు. ఘటన వివరాలు, ఆమె యోగక్షేమాలు తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ గూండాలపై పోలీసులు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి చిల్లర ప్రయత్నాలతో సునీతా లక్ష్మారెడ్డి లాంటి బలమైన నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు.

## గాంధీ ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత.. భారాస ఎమ్మెల్యేల అరెస్ట్




హైదరాబాద్: గాంధీ ఆసుపత్రిలోకి వెళ్లేందుకు యత్నించిన భారాస ఎమ్మెల్యేలు సంజయ్, మాగంటి గోపీనాథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య సేవలపై అధ్యయనం కోసం ఇటీవల భారాస కమిటీ వేసింది. వైద్యులైన సంజయ్, రాజయ్య, మెతుకు ఆనంద్ ఇందులో సభ్యులుగా ఉన్నారు. వైద్య, ఆరోగ్య సేవలపై నివేదిక ఇవ్వాలని ముగ్గురిని ఆ పార్టీ ఆదేశించింది. ఈ క్రమంలో సోమవారం కమిటీ సభ్యులు గాంధీ ఆసుపత్రికి వెళ్లాలని భావించారు. మరోవైపు పోలీసులు వారిని లోనికి అనుమతించలేదు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొనడంతో భారాస ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గృహనిర్బంధం చేశారు.

**అరెస్టును ఖండించిన కేటీఆర్ :** భారాస నేతలను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఖండించారు. సమస్యలు తెలుసుకునేందుకు వచ్చిన తమ నేతలను అరెస్టు చేశారన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వం అడ్డంకులు కలిగించవద్దన్నారు. రాజకీయాలకు అతీతంగా తమ నేతలు ఆసుపత్రులను పరిశీలిస్తారని చెప్పారు. ప్రభుత్వ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి చర్యలు చేపడుతున్నారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా లోపాలను ఎత్తి చూపుతామన్నారు.

## విర్రవీగితే మీకూ ఏపీ అధికారులకు పట్టిన గతే: మాజీ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వతం కాదని, అధికారులు రెచ్చిపోవద్దని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఏపీలో గత ప్రభుత్వంలో అధికారులు రెచ్చిపోయారు.. ప్రస్తుతం సస్పెండ్ అవుతున్నారు. అధికారంలో ఉన్నామని రెచ్చిపోతే అక్కడి అధికారులకు పట్టిన గతే మీకూ పడుతుంది. మాపై దాడులు చేసిన వారిపై ఇప్పటికీ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయలేదు" అని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాలో పంటపొలాలు ఎండిపోతున్నాయని హరీశ్‌రావు అన్నారు. "కృష్ణా జలాలు పరవళ్లు తొక్కుతున్నా.. పొలాలు ఎండుతున్నాయి. సెప్టెంబర్ 1న పాలేరు జలాశయానికి 100 మీటర్ల దిగువన కాలువకు గండి పడింది. ఇప్పటికి 22 రోజులవుతున్నా పూడ్చలేదు. సాగర్ నిండుకుండలా ఉన్నా ఆయకట్టు రైతులకు నీరందడం లేదు. గత ఏడాది ప్రకృతి కరవు తెస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ కరవు తెచ్చింది" అని హరీశ్‌రావు విమర్శించారు.

## కాంగ్రెస్ - కేసీఆర్‌కు పొంగులేటి మధ్యవర్తిత్వం నిజం కాదా..

హైదరాబాద్, సెప్టెంబర్ 23: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతుందే కాంగ్రెస్ పార్టీ అంటూ బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీ వేణు గోపాల్ దగ్గర కేసీఆర్ కుటుంబం చేసుకున్న ఒప్పందంపై మాట్లాడాలన్నారు. "అటు కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలకు, ఇటు రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్యవర్తిత్వం చేస్తూ కాపాడుతుంది నిజం కాదా.. కాంగ్రెస్ ఇప్పటి వరకు బీఆర్ఎస్‌పైన ఈడీ విచారణ, సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశాలు ఇవ్వడం లేదు. సీబీఐ విచారణ నేరుగా రాష్ట్రంలో చేయడానికి వీలు లేదని జీవో తెచ్చింది బీఆర్ఎస్ కాదా" అని ప్రశ్నించారు. "బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ నా మీద చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నా. ప్రజా సమస్యలపై బీజేపీ ఎన్నో పోరాటాలు చేసింది. శాసనసభలో నేను మాట్లాడింది ప్రజలు విన్నారు. రాష్ట్రానికి సీబీఐ వచ్చే రోజు దగ్గర్లోనే ఉంది. ధరణి, కాళేశ్వరం, విద్యుత్‌లతో అనేక అంశాల్లో బీఆర్ఎస్ చేసిన అవినీతి బయటకు రాబోతుంది. తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం ప్రతి అంశాన్ని పరిశీలిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అంగీకరిస్తే 24 గంటల్లో సీబీఐ దించుతాం. డ్రామా రావు డ్రామాలు ఆపితే బాగుంటుంది" అంటూ మహేశ్వర్‌రెడ్డి దుయ్యబట్టారు.

**వారికి ఇదే నా ఛాలెంజ్...** ఇటు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డికి వేల కోట్ల రూపాయల కాంట్రాక్టులు అప్పగిస్తూ ప్రజా ధనం వృథా చేస్తున్నారని మండిపడ్డారు. దీనికి బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారన్నారు. ఇది ప్రాఫిట్ ఆఫ్ ఇంట్రెస్ట్ అవునా.. కదా అని ప్రశ్నించారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ విషయంలో టెండర్లు అన్నీ రాఘవ కంపెనీకి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇచ్చారని.. ఇంకా కొన్ని మేఘ కంపెనీకి ఇచ్చారని తెలిపారు. ఈ రెండు కంపెనీలకు నాలుగు వేల ఐదు వందల కోట్ల రూపాయల వరకు కాంట్రాక్ట్ వర్క్‌లు ఇచ్చారన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com